


రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం): పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాలు నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో మాట్లాడారు. రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యూటేషన్, లావాదేవీలపై తహసీల్దార్లు దృష్టి పెట్టాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా దరఖాస్తులను తిరస్కరించవద్దని, అవసరమైతే అర్జీదారుతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మరమ్మతులకు ఆర్వో ప్లాంట్లను వెంటనే బాగు చేయాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సెప్టెంబరు 1వ తేదీన 95శాతానికి పైబడి చేయాలని, ఉపాధి హామీ పని దినాలను బాగా పెంచాలని ఆదేశించారు.

త్వరలో భూ బాంబ్!

- మార్కెట్ విలువల పెంపునకు కసరత్తు
- వివరాల సేకరించిన రిజిస్ట్రేషన్ శాఖ
- జేసీ ఆధ్వర్యంలో అధికారుల సమావేశం
- ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ప్రక్రియ



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 27 : జిల్లాలో భూములు, స్థలాల మార్కెట్ విలువల పెంపునకు రంగం సిద్ధమైంది. ఆదాయం పెంపుపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం మార్కెట్ విలువలను పెంచేందుకు పూనుకొంటోంది. తద్వారా రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా భూములు, స్థలాల విలువలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండగా, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. దీన్ని పరిగణలోకి తీసుకొని ఈసారి మార్కెట్ విలువలను 10 నుంచి 40 శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందటంతో భూములు, స్థలాల పెంపు ఏవిధంగా చేపట్టి, అమలు చేయాలనే అంశమై నివేదిక తయారు చేస్తున్నారు. ఆర్డీఓలు, నుడా అధికారులను సంప్రదించి విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. మంగళవారం తన చాంబర్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధ్యక్షతన జరిగిన మార్కెట్ విలువల అమలు కమిటీ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు. మార్కెట్ విలువలు పెంపు వల్ల ప్రజల్లో వ్యతిరేకత రాకుండా చూడాలనే అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. మార్కెట్ విలువలు పెంచితే ప్రభుత్వానికి భూమి అవసరమైనప్పుడు ఎక్కువ మొత్తం రిజిస్ట్రేషన్ శాఖకు చెల్లించాల్సి వస్తుంది. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని నివేదిక తయారు చేస్తున్నారు.

● విలువైన భూములపై దృష్టి

జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అంకణం విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలు, లక్షల్లో ఉంది. ఎకరం రూ.కోట్లు దాటుతోంది. అయితే, రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువలు మాత్రం వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో విలువైన భూముల మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలోని చాలా ప్రాంతాలలో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. కొత్త వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర భూములుగా మారుస్తూ భూమార్పిడి జరిగిన లేఅవుట్ల వివరాలను నుడా, ఆర్డీఓల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సేకరించారు. మార్కెట్ విలువలకు సంబంధించిన అన్ని అంశాలపై నివేదికను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్లు, జాయింట్ కలెక్టర్ ముందు ఉంచుతారు. ప్రభుత్వం నుంచి జీఓ విడుదల కాగానే మార్కెట్ విలువల పెంపు అమలులోకి రానుంది.

● 2019 నుంచి..

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భూములు, స్థలా మార్కెట్ విలువలు పెరిగాయి. 2019లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 10 నుంచి 30 శాతం పెంచారు. 2020లో ఎంపిక చేసిన పట్టణాల్లో 20 నుంచి 30 శాతం విలువలు పెరిగాయి. 2022లో జిల్లా కేంద్రాల్లో 20 శాతం పెరిగాయి. 2023లో జాతీయ రహదారులు, ఎంపిక చేసిన ప్రదేశాల్లో మార్కెట్ విలువలు 30 శాతం వరకు పెంచారు. పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాలలో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కూడా ఈ విలువలు పెరగనున్నట్లు సమాచారం.

నివేదిక తయారు చేస్తాం



జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ విలువల పెంపుపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెంపు అంశంతోపాటు పలు అంశాలు చర్చకు వచ్చాయి. ప్రాంతాల వారీగా పెంపునకు సంబంధించి నివేదిక తయారు చేస్తాం. ప్రభుత్వ ఆదేశాలు అందితే ఆ ప్రకారం మార్కెటు విలువల పెంపు అమలు ఉంటుంది.
- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

భూ మార్పిడి డేటా వెబ్‌ల్యాండ్‌లో అప్లోడ్ చేయాలి!

- మార్కెట్ విలువల కమిటీలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 27 : భూముల మార్పిడి డేటాను వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో భూముల మార్కెట్ విలువల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మార్కెట్ విలువను నిర్ధారించడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయ, నష్టాన్ని అరికట్టాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల డేటా సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి పొందాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. నీటి పారుదల సౌకర్యాల ఆధారంగా భూమి వర్గీకరణ స్వభావాన్ని మార్చాలన్నారు. కొత్తగా ఆమోదించబడిన లేఅవుట్లకు సర్వే నంబర్లు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు భానుమతి, రాంబాబు, మిల్కిరోషన్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం వాయిదా

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 27 : ఈనెల 29వ తేదీన కలెక్టరేట్‌లో జరగాల్సిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హమ్మయ్య.. నిధులొచ్చాయి!

15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 34.68 కోట్లు విడుదల

నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమచేసిన కేంద్రం



నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 27 : నిధుల లేమితో కునారిల్లుతున్న పంచాయతీలకు కేంద్రం ప్రభుత్వం ఊరటనిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి విడతగా జిల్లాలోని 722 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 34,68,63,138 రూపాయలు విడుదలయ్యాయి. బేసిన్ గ్రాంట్స్ కింద రూ.13.87 కోట్లు, టైడ్ గ్రాంట్స్ కింద 20.81 కోట్ల రూపాయలు ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో పంచాయతీల ఆర్థిక సమస్యలు చాలా వరకు గట్టెక్కనున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు అందాల్సిన ఆర్థిక సంఘం నిధులను రకరకాల పద్దులకు జమ చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితి గమనించిన కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి నిధుల విడుదల పద్ధతి మార్చింది. కేంద్రం నుంచి నేరుగా పంచాయతీ ఖాతాలకే నిధులు జమ చేసే విధానం అమలులోకి తెచ్చింది. ఈ కొత్త పద్ధతి అమలులోకి వచ్చిన తరువాత మూడవ సారి 15 ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను తొలి విడతగా విడుదలైన నిధుల వ్యయానికి సంబంధించిన ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. టైడ్ గ్రాంట్స్ కింద మంచినీరు, పారిశుధ్యం మెరుగు పనులకు వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ, స్కూళ్లకు మంచినీటి సరఫరా తదితరాలకు ఖర్చు చేయవచ్చు. బేసిక్ గ్రాంట్స్ నుంచి పంచాయతీ పరిధిలో కొత్త రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు, వీధి లైట్ల నిర్వహణ, స్మశానాల అభివృద్ధి తదితరాలకు ఖర్చు చేసుకోవచ్చు. మొత్తమ్మీద 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలతో పంచాయతీలు కొంతవరకు ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడ్డాయి.

మంచినీటి అవసరాలకే ప్రాధాన్యం



ప్రభుత్వం నుంచి నిధులు వస్తుంటే గ్రామంలో ప్రజల అవసరాలకు తగ్గట్టు పనులు చేయగలము. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. వీటితో తాగునీటి పర్యవేక్షణ మెరుగుపరుస్తాము. కొన్ని శాశ్వత పనులు చేయాల్సినవి కూడా ఉన్నాయి. కానీ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తాము. నిధులు జమ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
- కోసూరు సుభాషిణి, కాకుపల్లి సర్పంచి, నెల్లూరు రూరల్

అప్పులకు వడ్డీ కట్టలేకున్నాం!



గత మూడేళ్ల కాలంలో చెప్పాపెట్టకుండా విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుతో మా పంచాయతీలో రూ. 34 లక్షలు కట్ చేశారు. రూ.42లక్షలు అప్పు చేసి పంచాయతీలో పనులు చేశా. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసుకుంటుంటే మళ్లీ విద్యుత్ బిల్లుల బకాయిలు పెండింగ్ చూపించింది. వెంటనే మళ్లీ రూ. 2లక్షలు కట్టిన తర్వాత బిల్ అప్‌లోడ్ అయింది. ఇలా గత ప్రభుత్వంలో పంచాయతీ బిల్లుల రాక నానా ఇబ్బందులు పడ్డా. ఇప్పటికీ రూ.18లక్షలు అప్పులు తీరాల్సి ఉంది. తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టుకోలేక నిద్ర పట్టడంలేదు.
- కటకం నరసింహారావు, వైసీపీ సర్పంచి, చిన్నమాచునూరు, మర్రిపాడు మండలం

జడ్పీలో బదిలీల కోలాహలం

- ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరి
- 217 మందితో జాబితా సిద్ధం



నెల్లూరు (జడ్పీ) : జిల్లా పరిషత్‌లో బదిలీల కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 31లోపు బదిలీల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఎంపీడీవోల నుంచి అటెండర్ల వరకు బదిలీలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విధివిధానాలను రూపొందించింది. ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన వారి జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ఆరుగురు ఎంపీడీవోలు, 10 మంది ఏవోలు, 27 మంది సీనియర్ అసిస్టెంట్లు, 70 మంది జూనియర్ అసిస్టెంట్లు, 20 మంది టైపిస్టులు, 11 రికార్డు అసిస్టెంట్లు, 73 మంది అటెండర్లు ఇలా మొత్తం 217 మందిని బదిలీ చేసేందుకు జాబితా సిద్ధం చేశారు.

● పైరవీల కోసం పాకులాట

ఐదేళ్లు పూర్తి చేసుకుని స్థానచలనం తప్పనిసరి అయిన వారంతా పైరవీల కోసం పాకులాడుతున్నారు. అనుకూల ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ఎమ్మెల్యేల సిఫారసుల లేఖల కోసం ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల వద్దకు వెళ్లేందుకు అవకాశం లేనివారు తమను దూరప్రాంతాలకు బదిలీ చేస్తారన్న దిగులు వారిలో నెలకొంది.

ఫోర్జరీ కేసులో పోలీసుల దూకుడు

కార్పొరేషన్, నుడా కార్యాలయాల్లో విచారణ

పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్న డీఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే ఈ కేసులో నగరపాలక సంస్థ టీపీవో దేవేంద్రను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే మంగళవారం నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలోని ప్లానింగ్ విభాగం, నుడా కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. పలు ఫైళ్లను పరిశీలించడంతోపాటు ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల విచారణకు వచ్చిన ప్రతిసారి కార్పొరేషన్ కార్యాలయంలో ఇంకెదరు ఉద్యోగులు ఈ కేసులో ఇరుక్కుంటారన్న చర్చ నడుస్తోంది. మరోవైపు నుడా కార్యాలయంలో విచారణ చేయడం పెద్ద చర్చగా మారింది.

ఇసుక కొరతను తీర్చండి

- కలెక్టరేట్, కార్పొరేషన్, తహసీల్దారు కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నెల్లూరు (వైద్యం/సిటీ), ఆగస్టు 27 : ఇసుక కొరతను తీర్చి తమకు పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం నెల్లూరులో భవన నిర్మాణ కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. గాంధీబొమ్మ నుంచి కలెక్టర్ వరకు ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని కోసం ఎదురు చూసి తిరిగి వెళుతున్నారని పేర్కొన్నారు. అంతేగాక సిమెంట్ గోదాములు, పెయింటింగ్, ఐరన్ షాపులలో పనిచేసే కార్మికులకు కూడా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న 40 రకాల పనులు నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆవుల పెంచలయ్య, శ్రీనివాసులు, సూర్యనారాయణ, చిరంజీవి, మల్లిఖార్జున, వెంకట్రావు, వెంకయ్య, కన్నయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరురూరల్ తహసీల్దారు, కార్పొరేషన్ కార్యాలయాల వద్ద కూడా భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఐదు క్రీడా ప్రతిభా అవార్డులు

- రేపు అందజేయాలని ఆదేశాలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 27 : జిల్లాలో ఐదు ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు క్రీడా ప్రతిభా అవార్డులను ప్రకటించారు. గడిచిన ఏడాదిలో ఉత్తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించడంతోపాటు వివిధ క్రీడాంశాల్లో పతకాలు సాధించిన పాఠశాలలకు ర్యాంకులను కేటాయించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవం రోజు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న కేఎస్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం, కోవూరు డివిజన్ పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, నగరంలోని బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల తృతీయ, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల 4వ స్థానం, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు 5వ స్థానం కేటాయించారు. జిల్లా విద్యాశాఖాధికారులు జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించి ప్రజాప్రతినిధులు, అధికారుల ద్వారా అవార్డులు అందచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాలు జారీ చేశారు.

నేర నియంత్రణకు 'యాక్షన్'

- యాంటీ డ్రగ్ స్క్వాడ్ ఏర్పాటు
- మహిళల భద్రతకు పటిష్ట చర్యలు
- ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం),ఆగస్టు 27: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటూ నేర నియంత్రణే లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగిసిందన్నారు. ఈ క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వాటి హాట్ స్పాట్లను మ్యాపింగ్ చేస్తున్నామని, ప్రత్యేకంగా యాంటీ డ్రగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తామని ఎస్పీ చెప్పారు. గ్రామాలలో విస్తృతంగా మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాత నేరస్థులు, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీసీ కెమెరాలు, మెరుగైన లైటింగ్, అలారం, హెచ్చరిక వ్యవస్థ, నైట్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేస్తామన్నారు. సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. మహిళలు, పిల్లలపై నేరాలను సహించేది లేదని, ఎంతటివారైనా కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. అన్నీ పోలీస్ స్టేషన్లలో మహిళా హెల్ప్‌డెస్క్‌ను బలోపేతం చేస్తామని, మహిళల భద్రతపై సబ్ డివిజన్ వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మహిళల భద్రత కోసం డయల్ 112 గురించి విస్తృత ప్రచారం చేయి స్తామన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. రోడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి ప్రజల సహకారంతో నేరాలు అరికడతామన్నారు. ప్రజలు నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలతో రూపొందించిన కరపత్రాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో తనిఖీ

నెల్లూరులోని సంతపేట పోలీసు స్టేషన్, కోవూరు సర్కిల్ కార్యాలయాలను మంగళవారం రాత్రి ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిధులు, నేరనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ ఏ శ్రీనివాసరావు, సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, కోవూరు ఇన్‌స్పెక్టర్ వీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్ఐల బదిలీలు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లకు ఎస్ఐలను బదిలీ చేయడంతోపాటు వీఆర్‌లో ఉన్న ఎస్ఐలకూ పోస్టింగ్‌లు కల్పిస్తూ మంగళవారం ఎస్పీ జి కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమకు కేటాయించిన ప్రాంతల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
ఎం.ఎస్ రాకేష్	వీఆర్	మనుబోలు
బి రమేష్‌బాబు	దర్గామిట	సంతపేట
జి బాలకృష్ణ	ఎస్ఈబీ	సంతపేట
బి వెంకటేశ్వర్లు	డిసిఆర్‌బి	నెల్లూరు రూరల్
బి లక్ష్మణ్‌రావు	గుడ్లూరు	నెల్లూరు రూరల్
షేక్ మహమ్మద్ సుభాని	బాలాజీనగర్	లింగసముద్రం
ఎం బాజీబాబు	లింగసముద్రం	వీఆర్
పి అనూష	సీతారామపురం	సోమశిల
వి సుబ్బారావు	సోమశిల	వీఆర్
కె శ్రీనివాసరావు	వీఈఆర్	మర్రిపాడు
ఎస్కే అబ్దుల్ రజాక్	వీఆర్	చిన్నబజారు
ఎం రఘునాథ్	వీఆర్	సీసీఎస్
కే.తిరుపతయ్య	వీఆర్	ఇందుకూరుపేట
శివశంకర్	నార్త్ ట్రాఫిక్	దక్కిలి

ఫోర్జరీ సంతకంతో అక్రమ రిజిస్ట్రేషన్

● కాలనీ వాసుల ఫిర్యాదుతో వెలుగులోకి..

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 27: దుత్తలూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని కట్టకిం దపల్లె ఎస్సీ కాలనీలో ప్రజల అవస రాల నిమిత్తం సర్వేనెంబరు 1026-3 లోని 10 సెంట్ల పోరంబోకు స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలం లో కాలనీవాసుల దాహార్తి తీర్చేందుకు 2013లో పంచాయతీ అధికా రులు పైపులైన్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల తరువాత పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో 2017లో మరోబోరు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు అక్కడ నీటిని వినియోగించు కుంటున్నారు. ఆ స్థలా నికి సమీపంలో జాతీయ రహదారి వెళ్లడం, స్థలం రూ.లక్షల్లో విలువ ఉండడంతో దానిపై ఓ వ్యక్తి కన్ను పడింది. అంతే ఆ వ్యక్తి వీఆర్వో సంతకం ఫోర్జరీతో పోరంబోకు భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం బయటకు పొక్కడంతో కాలనీ వాసులు మంగళవారం తహసీల్దారు నాగరాజుకు ఫిర్యాదు చేశారు.



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పోరంబోకు స్థలం

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

కాలనీవాసుల కోసం వదిలిన పోరంబోకు స్థలానికి రిజిస్ట్రేషన్ చేయడం నేరం. కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొంటాం.

- నాగరాజు, తహసీల్దారు, దుత్తలూరు

● వీఆర్వో సంతకం ఫోర్జరీ

కాలనీ అవసరాల కోసం వదలిన స్థలాన్ని ఓ వ్యక్తి తన సొంత స్థలమంటూ అక్కడున్న మోటార్లు, పైపులైన్‌ను ధ్వంసం చేశాడు. ఆ స్థలాన్ని చదును చేశాడు. ఈ ఘటనపై కాలనీ వాసులు ఆరా తీయగా ఈ ఏడాది మే 5న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా తన పేరు మీద ఐదు సెంట్ల రిజిస్ట్రేషన్ చేయించుకు న్నట్లు రికార్డుల్లో ఉంది. అక్రమంగా రిజిస్ట్రేష న్ చేసిన ఆ స్థలం విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుంది. అప్పట్లో వీఆర్వోగా ఉన్న శ్రీనివాసులు అసలు సంతకానికి, రిజిస్ట్రేషన్ చేసిన సమయంలో ఉన్న సంతకానికి తేడా ఉంది. అసలు గ్రామనత్తం కింద ఉన్న పోరంబోకు స్థలం ఎలా రిజిస్ట్రేషన్ అయ్యిందో అంతుబట్టడం లేదు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై మంగళవారం తహసీల్దారుకు కాలనీ వాసులు ఫిర్యాదు చేశా రు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



స్వాధీనం చేసుకున్న బైకులతో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ తదితరులు

బైక్ దొంగల అరెస్ట్

15 వాహనాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 27 : జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు నేరస్తులను దర్గామిట్ట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఐదు పోలీసు స్టేషన్ల పరిధిలోని రూ.5.95 లక్షల విలువ చేసే 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జీ కృష్ణకాంత్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం, పాదర్తి గ్రామానికి చెందిన కర్పూరం శివరామకృష్ణారెడ్డి, నెల్లూరులోని భక్తవత్సల నగర్‌కు చెందిన రవ్వ శ్రావణ్‌కుమార్ మారుతాళాలు ఉపయోగించి బైకులు దొంగతనాలు చేయడంలో ఆరితేరారు. ఈ క్రమంలో నెల్లూరు నగరంలో వరుస దొంగతనాలు జరుగుతుం డటంతో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య, సిబ్బం దితో కలిసి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులను మంగళవారం నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రం సమీపంలో అరెస్ట్ చేశారు. వారిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా దర్గామిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో 3, చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో 6, వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో 1, బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో 2, ప్రకాశం జిల్లా ఒంగోలు వన్‌టౌన్ పరిధిలో 3 కలిపి మొత్తం 15 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేరస్తులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన క్రైం సిబ్బంది, దర్గామిట్ట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

పోలీసులపై విశ్వాసానికే కార్డన్ సెర్చ్

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 27: సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంచటానికే కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న చంద్రబాబు నగర్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతోపాటు స్పెషల్‌పార్టీ సిబ్బంది, పదుల సంఖ్యలో పోలీసు సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. చంద్రబాబు నగర్‌లోని ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని 17 బైక్‌లు, 1 ఆటోను స్వాధీ నం చేసుకున్నారు. 7 మంది రౌడీషీటర్ల ఇళ్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ ప్రత్యేక కార్యచరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకుని, వెండి, బంగా రు వంటి చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడమే ఈ ప్రత్యేక ఆపరేషన్ లక్ష్యమన్నారు. అనుమా నంగా ఉన్న, రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆటో మొబైల్ షాపులో అగ్నిప్రమాదం

ఆత్మకూరు, ఆగస్టు 27 : స్థానిక దర్గా సెంటర్‌లోని మదీనా ఆటోమొబైల్ షాపు లో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. షాపులో పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం అందజేశారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు. సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని సమాచారం.



షాపులో కాలిపోయిన సామగ్రి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6903
వెండి కిలో ధర	రూ. 88,700
వెండి ఒక గ్రాము	రూ. 91.70

గాయపడ్డ వ్యక్తి మృతి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 27: మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి మతిస్థిమితం లేని వ్యక్తి పులివర్తి నాగేశ్వరరావు దాడిలో వల్లెం విశ్వనాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. పోలీసులు గ్రామానికి చేరుకొని విశ్వనాథ్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కాగా కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్ఐ ఆదిలక్ష్మిలు నర్రవాడకు చేరుకొని జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నెల్లూరు రూరల్ మండలం ములుముడి గ్రామంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్

ఈ-పంట రైతులకు భరోసా!

● ప్రభుత్వ పథకాల లబ్ధికి అదే ప్రమాణికం

● ఈసారి కౌలు రైతులకూ అవకాశం

● వచ్చే నెల 15 వరకు నమోదుకు అవకాశం

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 27 : ఆరుగాలం కష్టించి పంటలను సాగుచేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా పంట రుణాలపై వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం అందించేందుకు, ధాన్యం కొనుగోలు వంటి పలు పథకాలు రైతుల దరి చేరాలంటే ఈ-పంట నమోదే ప్రమాణికం. అంతటి ముఖ్యమైన ఈ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఖరీఫ్ పంటల సాగు నమోదుకు కార్యాచరణ చేపట్టింది. అంతేగాక పంట సాగు హక్కు కార్డులు పొందిన కౌలు రైతులకు అవకాశం కల్పించింది.

● కౌలు రైతులకు అవకాశం

జిల్లాలో ఖరీఫ్ సాగు చివరి దశకు చేరుకుని, పంటలు చేతికందే స్థాయికి వచ్చేశాయి. అయితే నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఈ-పంటపై పూర్తిస్థాయి దృష్టి సారించింది. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ-పంట నమోదు చేయాల్సిందేనని ఆదేశాలు వచ్చాయి. ఏ రైతు ఏ రకం పంట పండిస్తున్నారు వంటి విషయాలు సేకరించడంతోపాటు సాగుదారుడి ఆధార్, ఫోన్ నెంబరు, సర్వే నెంబర్లతోపాటు సాగు పంటలను ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాలి. సాధారణంగా పంటలు సాగు చేసుకుంటున్న రైతుల వివరాలను ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే గతంలో ఆ పొలం యజమాని అభ్యంతరాలతో అధికశాతం మంది కౌలు రైతులకు ఈ-పంట నమోదు ఉండేది కాదు. దీంతో పంటలు దెబ్బతింటే ఎలాంటి ప్రయోజనం దక్కేది కాదు. ఈసారి ఈ పరిస్థితి లేకుండా నూతన ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. పొలంలో పంట సాగు చేస్తున్న కౌలు రైతు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పంట నష్టపోతే బీమా, పెట్టుబడి రాయితీ సాగుదారుడికే దక్కేలనే ఉద్దేశంతో వాస్తవంగా సాగు చేస్తున్న రైతు పేరు నమోదు చేయా లని ఆదేశించింది. దీంతో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ-పంట నమోదు వల్ల ప్రభుత్వం అందే పథకాలు, ఉపయోగాలను రైతులకు వివరించి నమోదు చేస్తున్నారు.

● సాంకేతిక సమస్యలు తలెత్తకుండా..

ఈ-పంట నమోదు కార్యక్రమం జిల్లాలో వేగంగా సాగుతోంది. వ్యవసాయశాఖ సహాయకులు పొలం వద్ద రైతును ఉంచి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలోలా సాంకేతిక పరమైన సమస్యలు తలెత్త కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రైతు ఫోన్‌కు వచ్చే ఓటీపీ, బయోమెట్రిక్, ముఖ చిత్రం గుర్తింపు వంటి అనుమతులు ఇచ్చారు. రైతు వివరాలతోపాటు పంట రకం, విస్తీర్ణం, నీటి లభ్యత తదితర అంశాలను యాప్‌లో నమోదు చేస్తారు. వరి పంటకు సంబంధించి ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో ఈ-పంట నమోదు వచ్చే నెల 15వతేదీ వరకు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే 94శాతం నమోదు పూర్తి



జిల్లాలో దాదాపు 94 శాతం ఈ-పంట నమోదు పూర్తిచేశాం. రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం ద్వారా లభించే పథకాలు దూరమయ్యే అవకాశం ఉంది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 83,684 ఎకరాల్లో పంటలు సాగవుతుండగా ఇప్పటికి 78,697 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేయడం జరిగింది. నూరు శాతం లక్ష్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంట, ఈకేవైసీ నమోదు చేసుకోవాలి.

- పీ సత్యవాణి, జేడీ, వ్యవసాయ శాఖ

స్కానింగ్ కేంద్రాలు చట్టపరంగా నడుచుకోవాలి

● సరోగసిపై దళారులను నమ్మవద్దు

● సలహా మండలి సమావేశంలో డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 27 : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు తప్పని సరిగా చట్టపరంగా నడుచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళ వారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాలు ప్రతీనెల 2వ తేదీన నివేదిక ఇవ్వాలని తెలియచేశారు. జిల్లాలో లింగ నిష్పత్తిలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం ప్రతి వేయి మంది బాలురకు 1011 మంది బాలికలు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. సరోగసి ద్వారా సంతానం పొందాల్సిన వారు దళారులను కలిసి మోసపోకుండా నేరుగా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ దయాకర్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ సుల్తానా, డాక్టర్ కిరణ్, కుసుమకుమారి, కవితారెడ్డి ఎన్‌జీవో శ్రీనివాసులు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.



కమిటీతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయండి

- కలెక్టర్ వో. ఆనంద్

కొడవలూరు ఆగస్టు27 : ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వో. ఆనంద్ తెలిపారు. మం డలంలోని చంద్రశేఖరపురం గ్రామంలో ఉన్న ఇఫ్కో కిసాన్‌సెజ్ భూములను ఆయ న మంగళవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెజ్‌ల కోసం మంజూరు చేసిన భూముల్లో పూర్తిస్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిశ్ర మల ఏర్పాటు, నీటి అవసరాల అనుమ తులు, భూములు వివరాలను పవర్ పాయింట్ ద్వారా ఆయన వివరించారు. అలాగే సెజ్‌లో పెద్దపెద్ద పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేసి, జిల్లాను పారిశ్రామికవాడగా మార్చాలన్నారు. సెజ్‌లకు కేటాయిం చిన భూముల్లో పరిశ్రమలకు నీటి సమస్యను పరిష్కరిం చాలన్నారు. సమావేశంలో కావలి ఆర్డీవో శీనానాయక్, ఏపీఐఐసీ డిప్యూటీ జడ్ఎం సురేష్, పాల్గొన్నారు.



ఇఫ్కో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అవినీతిని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం

● స్వామిపై విశ్వాసంతో ఆలయాభివృద్ధికి కృషి ● వెంకయ్యస్వామి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం

వెంకటాచలం, ఆగస్టు 27 : గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్ర మంలో ఒక్క రుపాయి అవినీతి జరిగినట్లు నిరూపిస్తే తాను ఏ శిక్షకైనా సిద్ధమని ఆ ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. మంగళవారం గొలగమూడి లోని ఆశ్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఒక్క రుపాయి కూడా జీతం తీసుకోకుండా స్వామిపై ఉన్న విశ్వాసంతో ఆశ్రమ అభి వృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకే తాను ఆశ్రమంలో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన 42వ ఆరాధన ఉత్సవాలకు విచ్చేసిన వెంక య్యస్వామి కుటుంబ సభ్యులమని చెప్పుకునే వారికి మర్యాదపూర్వకంగా దర్శన ఏర్పాట్లు చేసి గౌరవించినట్లు చెప్పారు. ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై వారు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలుగా ఆయన కొట్టిపారేశారు. న్యాయస్థానాలు కూ డా స్వామి వారి వారసులుగా ఎవరికీ హక్కులు కల్పించలేదన్నారు. తాను ఈవోగా బాధ్యతలు తీసుకోకముందు ఆశ్రమ ఆస్తి రూ.7 కోట్లు మాత్రమేనని, ఇప్పుడు రూ.200 కోట్లకు పైగానే చేరిందన్నారు. తనపై ఎవరెన్ని విమర్శలు చేసినా వెంక య్యస్వామి ఆశ్రమాన్ని షిరిడి తరహాలో అభివృద్ధి చేయడమే తన ప్రధాన సంక ల్పంగా ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం

6 నుంచి వేళాంగిణి మాత మహోత్సవాలు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 27 : కోడూరు సాగర తీరాన వెలసి ఉన్న ఏసుప్రభువు తల్లి మరియమ్మ జన్మదిన వేడుకలు (వేళాంగిణి మాత మహోత్సవాలు) సెప్టెంబరు 6వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నట్లు పుణ్యక్షేత్రం డైరెక్టర్, విచారణ గురువులు పిన పాటి లుకస్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ మరియమ్మ జన్మదినం సెప్టెంబరు 8వ తేదీ కావడంతో 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ఈనెల 29న జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. అప్పటి నుంచి ప్రతిరోజు సాయంత్రం ప్రార్థ నలు జరుగుతాయన్నారు. భక్తులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఉదయం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. బీచ్ రహదారి మార్గం మరమ్మతులు చేయడంలో కృషి చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డికి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బొమ్మి సురేంద్ర, స్థానిక నేత వీరబోయిన గంగాధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సహాయ గురువులు సింహం సాగర్ బాబు, జోసఫ్, తంబి పుణ్యక్షేత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు

చిత్రగుంట, ఆగస్టు 27: బోగోలు మండలం ముంగమూరు సమీపంలో ఓ కారు అదుపు తప్పి బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై బోజ్యా తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముంగమూరులో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ మరమ్మతులకు గురికావడంతో రెండు రోజులుగా టెలికం సిబ్బంది పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో కనెక్షన్ ఇచ్చేందుకు కావలి టెలికామ్ సబ్ డివిజనల్ ఇంజినీరు దువ్వాడ హరికృష్ణ, సిబ్బంది ప్రైవేటు కారులో మంగళవారం ముంగమూరుకు వెళుతుండగా అదుపుతప్పి వాగులో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎస్‌డీఈ హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ నాగరాజుతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. ప్రమాదంలో గాయపడిన జామవా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఆ ముగ్గురు జైలులో స్నేహితులుగా మారారు. బయటకు వచ్చాక దొంగతనాలు చేసి, పంచుకుందామని ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రకారమే బయట ఉన్న మరో ముగ్గురిని కూడా కలుపుకొని ముఠాగా ఏర్పడ్డారు. సుమారు 8 నెలలపాటు నెల్లూరులో వరుస చోరీలు చేసి ఇటు ప్రజలకు, అటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేశారు. చివరకు పోలీసుల చేతికి చిక్కి కటకటాలపాలయ్యారు. ఆ ముఠా వివరాలను ఎస్పీ కృష్ణకాంత్ ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో పాత్రికేయులకు వివరించారు.

ముప్పుతిప్పలు పెట్టిన ముఠా దొరికింది!

● జైలులో పరిచయం.. ముఠాగా ఏర్పడిన ఆరుగురు

● 8 నెలలుగా నెల్లూరులో వరుస చోరీలు

● చివరకు పోలీసులకు దొరికిపోయారు!

● రూ.13.47 లక్షల బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం

నెల్లూరు (క్రైం), ఆగస్టు 27 : నెల్లూరులోని ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన కోట హరికృష్ణకు సోషల్‌మీడియాలో అమలాపురానికి చెందిన ఓ మహిళ పరిచయమైంది. ఆ మహి ళను హత్య చేసిన ఘటనలో హరికృష్ణ రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో జైలు శిక్ష అనుభవించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కాకినాడకు చెందిన రౌడీషీటర్ డి ప్రసాద్ అలియాస్ దర్మాది దుర్గాప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం గాదిమొగ గ్రామానికి చెందిన పి సత్యనారాయణలతో పరిచయమైంది. నెల్లూరులో దొంగతనాలు చేద్దామని, వచ్చిన దానిలో ముగ్గురం సమానంగా పంచుకుందామని హరికృష్ణ తెలపడంతో వారు అంగీకరిస్తారు. హరికృష్ణ నెల్లూరుకు చేరుకొని తన స్నేహితులైన ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన ఎం శ్రీహరి, శ్రీనివాస అగ్రహారానికి చెందిన బి లక్ష్మయ్యలను కూడా తన ముఠాలో కలుపుకున్నాడు. ఇదే క్రమంలో ప్రసాద్, సత్యనారాయణలు ఒప్పంద విషయాన్ని పాత నేర స్థుడైన తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన కె శ్రీనివాస్‌కు తెలియజేశారు. వీరంతా 8 నెలలుగా నెల్లూరులోని వేదాయపాలెం, బాలాజీనగర్, నవాబుపేట, నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. వరస దొంగతనాల కట్ట డికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించడంతో నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయ పాలెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ నేతృత్వంలో వేదాయపాలెం, బాలాజీగనర్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

● వాహన తనిఖీల్లో

సాంకేతిక ఆధారంగా ప్రత్యేక బృందాలు నిందితులను గుర్తించాయి. మంగళవారం ప్రత్యేక బృందం గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా నిందితులు రెండు బైక్‌లపై చోరిసొత్తును తీసుకెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా వేదాయపాలెం స్టేషన్ పరిధిలో నాలుగు, నవాబుపేట స్టేషన్ పరిధిలో ఒకటి, బాలాజీనగర్ స్టేషన్ పరిధిలో మూడు, నెల్లూరు రూరల్ పరిధిలో దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.13,47,500 విలువ చేసే 372 గ్రాముల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా ముఠాను అరెస్ట్ చేసిన నగర డీఎస్పీ, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్‌లతోపాటు ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ ప్రసాద్, హెచ్‌సీ సుబ్బారావు, పీసీలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో మళ్లీ దొంగలు పడ్డారు!

● ఈసారి ఫర్నిచర్ అపహరణ?

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 27 : దొంగతనాలకు నిలయంగా పేరొందిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో (డీఎం హెచ్‌వో) మళ్లీ చోరులు తెగబ డ్డారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడి, ఓ గదికి వేసిన తాళాలను పగలగొట్టారు. ఆ గదిలో ఉన్న విలువైన ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లారు. విలేజ్‌హెల్త్ క్లినిక్ కోసం గత ప్రభుత్వ హయాంలో వచ్చిన టెబుళ్లు, కంప్యూటర్లు పెట్టుకునేందుకు పరికరాలతోపాటు ఇతర సామగ్రి ఆ గదిలో ఉంచారు. ఇది గమనించిన దుండగులు సోమవారం రాత్రి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి ఫర్నిచర్‌ను చోరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య వెంటనే కార్యాలయానికి చేరుకుని చోరీ జరిగిన గదిని పరిశీలించారు. అధికారులు మాత్రం ఎలాంటి ఫర్నిచర్ చోరీ కాలేదని డీఎంహెచ్‌వోకు వివరించినట్లు సమాచారం. అయితే, తలుపుల తాళాలు ఎందుకు పగలగొట్టారు? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే ఇది ఇంటిదొంగల పనా.. లేదా బయటవారి పనా!? అన్నది తేలుతుంది.



గదికి వేసిన తాళాలను పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

కలువాయి చెరువు నిర్వహణ గాలికి..

- మరమ్మతుల్లో తూములు
- పట్టించుకోని సోమశిల అధికారులు

కలువాయి, ఆగస్టు 27 : జిల్లాలోని పెద్ద చెరువుల్లో మూడోది కలువాయి చెరువు. అంతేకాక సోమశిల దక్షిణ కాలువ కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కూడా చేశారు. దక్షిణ కాలువ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలంటే ముందుగా సోమశిల నీటితో కలువాయి చెరువు నింపాలి. ఆ తరువాత ఇక్కడ నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తుంటారు. దీంతో పాటు చెరువు కింద కలువాయి, నూకనపల్లి, తెలుగురాయపురం, బ్రాహ్మణపల్లి, బద్దెవోలు గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. ఇంతటి ప్రాధాన్యత కల్గిన చెరువు సోమశిల ప్రాజెక్టు అధికారుల కంట్రోల్‌లో ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా ఆయకట్టుకు నీరు అందించే చెరువు తూములకు మరమ్మతులు లేవు. దీంతో ప్రస్తుతం ఆయకుట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందక కష్టాలు



తూముకు మరమ్మతు చేస్తున్న బ్రాహ్మణపల్లి రైతులు

పడుతున్నారు. చెరువు కింద ప్రస్తుతం వరి సాగులో ఉంది. చెరువులో నీరు కూడా అడుగంటుతుంది. ఉన్న నీరు కూడా చెరువు తూములు సక్రమంగా లేక పోవడంతో పొలాలకు సక్రమంగా అందడం లేదు. దీంతో ఇటీవల బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ సొంత ఖర్చులతో తూముకు మరమ్మతులు చేసుకున్నారు. సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల చేసే గేటు ఇటీవల కొట్టుకుపోయింది. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేసి కాలువకు అవసరమైనప్పుడు నీరు విడదల చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులో నీరు అడుగంటి పోతుండటంతో తూములు, దక్షిణ కాలువ రెగ్యులేటర్ గేటుకు శాశ్వత మరమ్మతులు చేసుకునేందుకు వీలు ఉంటుంది. కాబట్టి సోమశిల ప్రాజెక్టు అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 27: స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేపట్టారు. అనంతరం భగవద్గీత పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉదయగిరి : స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సంగం : అభయాంజనేయుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

● ఘనంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

సీతారామపురం : స్థానిక కురవవీధిలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను శ్రీకృష్ణయాదవ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు,గ్రామ సర్పంచి భాగ్యకుమారి హాజరై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాలలు వేసి, ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం కమిటీ నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బండి రవి, బండి మధు, ఆరేళ్ల దస్తగిరి, ఆరేళ్ల కాశి తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా అభయాంజనేయుడి విగ్రహం ఊరేగింపు

సంగం : మండలంలోని దువ్వూరులో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం స్వామివారి గ్రామంలో విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనకు విద్యార్థులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 27: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండవ సెమిస్టర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లారు. కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ కేఎస్ఆర్ పాల్ మాట్లాడుతూ 80 మంది విద్యార్థులతోపాటు అధ్యాపకులు, సిబ్బంది మూడు రోజులపాటు పర్యటనకు వెళ్లనున్నారన్నారు. ఈ పర్యటనతో విద్యార్థులకు అవగాహన, అనుభవం కలుగుతాయన్నారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నారాయణస్వామి, కిషన్‌తేజ, అశోక్, క్రాంతి బోధన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

కలువాయి, ఆగస్టు 27: మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితశాస్త్రం బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ గణితంలో 50శాతం మార్కులు ఉన్న వారు అర్హులని తెలిపారు. వీరికి నెలకు రూ. 10వేలు గౌరవవేతనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆత్మకూరు, ఆగస్టు 27 : మండలంలోని రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రత్యేక దృష్టి సారించామని తహసీల్దార్ వీ సుధీర్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పలువురు టీడీపీ నేతలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. అర్హులకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

సోమశిలలో 32.866 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 27: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 13,763 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 32.866 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

వింజమూరు, ఆగస్టు 27: కావలి నుంచి రాత్రి 9గంటలకు వింజమూరు మీదుగా ఆత్మకూరు వెళ్లేందుకు బస్సు ఏర్పాటు చేయాలని ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ స్టేట్ ఈసీ మెంబర్ లెక్కమనేని రాజేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే రాత్రి 10గంటలకు కావలి నుంచి వింజమూరు మీదుగా ఉదయగిరికి వెళ్లేందుకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.కావలి డివిజన్‌లోనే పెద్దదైన వింజమూరుకు రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

'మరుగుదొడ్ల బాధ్యత మాకొద్దు'

సీతారామపురం,ఆగస్టు 27: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటోలు తీసే బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు అప్పగిస్తూ జీవో జారీ చేయడం బాధాకరమని, ఆ పనిని తమకు అప్పగించడం తగదని మండలంలోని సచివాయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు అన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఎంఈవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందచేశారు. ఉపాధ్యాయులే అవమానంగా భావించిన పనని తమకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు.ప్రతి సచివాలయం పరిధిలో నాలుగు నుంచి ఆరు పాఠశాలలు ఉన్నాయని, ఈ పని తమకు భారం అవుతుందని వారు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ నేత్రదానాన్ని ప్రోత్సహించాలి

ఆత్మకూరు, ఆగస్టు 27: నేత్రదానాన్ని ప్రోత్సహించడంలో ప్రతి ఒక్కరూ తోడ్పడాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం. శర్వాణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్యశాలలో మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ



మాట్లాడుతున్న డాక్టర్ శర్వాణి

నేత్రదానం ఆవశ్యకతను వివరించారు. దేశంలో 50 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని తెలిపారు. కావున ప్రజలందరూ నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్ఎంవో డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ఉదయగిరి రూరల్ : మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అప్తాలమిక్ అసిస్టెంట్ బీ సాహితి విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం. నాయబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన టీడీపీ నేతలు



ఎస్ఐ షేక్ జిలానీని సన్మానించిన టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 27 : ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ జిలానీని మంగళవారం పలువురు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, జీ వేణు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సంగం, ఆగస్టు 27: మండలంలోని దువ్వూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాకారులు నాటికల రూపంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల వ్యాపించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్యపై ఒక్కరోజు శిక్షణ

సీతారామపురం, ఆగస్టు 27 : స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మంగళవారం దూరవిద్యపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి మాట్లాడుతూ ఓపెన్ స్కూల్



శిక్షణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి

లో 10వ తరగతి, ఇంటర్‌లో న్యూ అడ్మిషన్ కోసం మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన కల్పించి, వయోజనులను గుర్తించి దూర విద్యలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

అనంతసాగరం, ఆగస్టు 27: తహసీల్దార్ వీర వసంతరావును మంగళవారం మండల జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిపేలా ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భరత్, ఉదయగిరి రవి, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ

వింజమూరు, ఆగస్టు 27 : కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను ఖండిస్తూ మంగళవారం పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శివాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పొన్నూరు ప్రకాశం, పానుగంటి రమేష్, టీవీ సురేష్, దేగా మధుయాదవ్, బిందు, చేబ్రోలు వసంతరావు, కొండా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి సీఐకి సత్కారం

వింజమూరు : కలిగిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటనారాయణను టీడీపీ నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలాగా శాంతి భద్రతల పరిరక్షణ చేపట్టాలని కోరారు కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, గూడా నరసారెడ్డి,మంచాల శ్రీనివాసులునాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లునాయుడు, వెంకటరెడ్డి, ఏగినేని శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సీఐని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రైల్వే కార్మికుల హర్షం

బిట్రగుంట: కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ ప్రకటించడంపై మంగళవారం రైల్వే కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. స్థాని పీడబ్ల్యూఐ కార్యాయం వద్ద ఎస్ఆర్ఎంయూ బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక పీడబ్ల్యూఐ ఏకే కృష్ణన్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

- ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

కావలిరూరల్, ఆగస్టు 27: నేను కూడా రైతు బిడ్డనే.. రైతుల కష్టాలు తనకు తెలుసు.. కావలి కాలువ ఆయకట్టు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులో భాగంగా రాజకీయ అవకాశాలు కల్పిస్తే వారు ఇంట్లో కూర్చుని సమావేశాలకు వారి భర్తలను, పిల్లలను పంపటం సరికాదని ఇలాంటి ఆచారానికి స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడీవో శ్రీధర్‌బాబు, డీఎల్‌పీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో కాంతారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రిష్ణచైతన్య, జడ్పీటీసీ జంపాని రాఘవులు, వైస్ ఎంపీపీ అరగల కవిత, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

● తుమ్మలపెంట రోడ్డు నిర్మాణానికి 1న శంకుస్థాపన

కావలి : ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలి-తుమ్మలపెంట రోడ్డులో రాకపోకలకు ప్రజలు పడిన నరకానికి విముక్తి కలిగిస్తూ సెప్టెంబరు 1న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ రోడ్డుపై 9 కి.మీ పాదయాత్ర చేపట్టి తుమ్మలపెంట కూడలిలో మహిళలచే శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రోజే రోడ్డు పనులు ప్రారంభించి డిసెంబరు 31 నాటికి పూర్తి చేసి జనవరి 1న ఈ రోడ్డుపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, పోతుగంటి అలేఖ్య, నాయుడు రాంప్రసాద్, బొట్లగుంట శ్రీహరినాయుడు, తిరువీది ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రోడ్డులో ఆక్రమణల తొలగింపు

కావలి, ఆగస్టు 27: పట్టణంలోని రైల్వే రోడ్డులో వైసీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ కేవీ నారాయణ రోడ్డు స్థలం ఆక్రమించి నిర్మించిన రెండు దుకాణాలను మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ ఆక్రమణలను గతంలోనే గుర్తించిన అధికారులు తొలగించేందుకు ఎక్స్‌కవేటర్‌తో వెళ్లగా అప్పట్లో వైసీపీ నేతలు అడ్డుకున్నారు. మరుసటి రోజు తొలగింపునకు వెళ్లగా అప్పటికే స్టే



ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఆక్రమణలు

తెచ్చినట్లు చూపించడంతో దానిని వదిలి వేశారు. ఆ తర్వాత ఆ రెండు చిన్న దుకాణాలకు ఇచ్చిన డీకేటీ పట్టా నకిలీ అని తహసీల్దారు ఇచ్చిన ధ్రువీకరణపత్రం, అవి రోడ్డు ఆక్రమణలో ఉన్నాయని సర్వేయర్ సర్వే రిపోర్టు ఇవ్వడంతో వాటి ఆధారంగా కోర్టులో ఉన్న స్టేను తొలగింపచేశారు. దీంతో అధికారులు ఆ దుకాణంలో ఉన్న సామాన్లు తీయించి పోలీసుల సహకారంతో కూల్చివేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

అల్లూరు, ఆగస్టు 27 : మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మానవాళికి ప్రమాదం లేకుండా చేసే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణ వ్యవసాయానికి ప్రకృతి వ్యవసాయానికి ఉన్న వ్యత్యాసాన్ని, దిగుబడుల శాతాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వ్యవసాయాధికారి శైలజ కుమారి, మధురిమ, అల్లూరు వ్యవసాయాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థినులకు అభినందనలు

లింగసముద్రం, ఆగస్టు 27 : విజయవాడలోని చెన్నుపాటి కోటయ్య ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో, తిరుపతి జిల్లా రేణిగుంట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో మండలంలోని పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి బంగారు, వెండి, కాంస్య



పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులు ఏ మౌనిక, డి.సమీరా, ఎం మేఘన, పి అనుదీవెన, డి.క్రాంతి, కె.లక్ష్మీప్రసన్న, జె.అలేఖ్య, జె.అక్షయ, బి.మహాలక్ష్మిలను ప్రిన్సిపాల్ కె స్నేహలత, ఉపాధ్యాయని పి.మాధవి, పీఈటీ పీ జ్యోతిర్మయిలు మంగళవారం అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

కావలి టౌన్, ఆగస్టు 27: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శ్రేణులు విజయవంతం చెయ్యాలని ఆ పార్టీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ చేతుల మీదుగా సెప్టెంబరు 1వ తేదీన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయిలో 200 సభ్యత్వాలు చేయించాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, రంగారెడ్డి, కమల, పరుశు వెంకటేశ్వర్లు, మాధవి, సీవీసీ సత్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 27: ఉమ్మడి ప్రకాశం జిల్లా నాయీ బ్రాహ్మణ పేద విద్యార్థులు ప్రతిభ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి కరేటి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నాయీబ్రాహ్మణ విద్యార్థులు చదువులో మెరుగ్గా రాణిస్తున్న వారందరికీ ఉపకార వేతనాలు అందిస్తామని, ఆసక్తి కలిగిన వారు ఒంగోలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రాఘవ బుక్‌డిపోలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కావలి ల్యాండ్ మార్క్‌గా జాతీయ జెండా : సీపీఐ

కావలి, ఆగస్టు 27: పెద్దపెద్ద నగరాలు, పట్టణాలకు ల్యాండ్ మార్క్ ఉన్నట్లుగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన జాతీయజండా ఐకానిక్ కావలికి ఒక ల్యాండ్ మార్క్‌గా గుర్తింపు తెచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. మంగళవారం సీపీఐ నేతలతో కలిసి ఆయన ఐకానిక్‌ను సందర్శించారు. 100 అడుగుల జాతీయ జెండా, అక్కడ ఏర్పాటు చేసిన దేశ ప్రముఖులు, కావలి శాసనసభ్యులుగా పనిచేసిన వారి చిత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, సీపీఐ కావలి నియోజకవర్గ సహాయకార్యదర్శి పీ.బోస్, కే.నరసింహారావు, చేవూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు

బిట్రగుంట, ఆగస్టు 27 : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంలో వెలసి ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్ర మాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు జరుగుతాయని, శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు జ్ఞానప్రసూనాంబ, కుమారస్వామి, నవగ్రహాలు, జంటనాగుల విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

బిట్రగుంట, ఆగస్టు 27: బోగోలు మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మంగళవారం కూడా ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంప్రదాయం ప్రకారం రోహిణి నక్షత్రాన కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైష్ణవ శ్రీకృష్ణ జయింతి వేడుకలు ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని సంతాన గోపాల కృష్ణుడు ఊరేగింపుగా ఆలయ తూర్పు ఈశ్యాన్య మూలమండపానికి చేరుకున్నాడు. అనంతరం ఉట్టి కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. బోగోలు యాదవపాలెంలోని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున వేణుగోపాలుడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.



గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 27: పంట పొలాలో భూసారాన్ని పెంచుకునేందుకు పశువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడాలని వ్యవసాయ అధికారులు శైలజాకుమారి, మధురిమ అన్నారు. బోగోలు మండలం తాళ్లూరు, బిట్రగుంట గ్రామ పంచాయతీలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కలిగిరి, ఆగస్టు 27: ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులతోపాటు ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఉమాశంకర్ పేర్కొన్నారు. స్థానిక కలిగిరమ్మ కూడలిలో మంగళవారం రాత్రి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. అక్కడ సిబ్బందిని నియమించి రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉన్న వాహన యజమానులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. కూరగాయలు, నిత్యావసరాల దుకాణాల యజమానులకు రహదారిపై రాకుండా హెచ్చరికలు జారీ చేశారు. పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్‌పై ఎస్ఐ దృష్టి సారించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతలకు అభినందనలు

కావలి, ఆగస్టు 27: టీడీపీ యాప్‌ను అత్యధికంగా వినియోగించి సామాజిక మాధ్యమాల్లో టీడీపీకి విశేష ప్రచారం కల్పించిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకాలతో ప్రశంసాపత్రాలు పంపి ప్రశంసించారు. వీటిని పొందిన అంబటి కిషోర్‌చౌదరి, ప్రళయకావేరి సాయిశివరాం, దేవరపాటి నాగేశ్వరరావు, కావలి జగన్‌మోహన్‌రావు, తటవర్తి సాయిచరణ్, పట్నం బాలక్రిష్ణ, నక్కల రవి, కంచర్ల సీతారామయ్యలకు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అభినందించారు.

అంగన్‌వాడీల్లో సూపర్‌వైజర్ విచారణ

వలేటివారిపాలెం, ఆగస్టు 27 : మండలంలోని చుండి అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మంగళవారం విచారణ చేపట్టారు. చుండి బస్టాండు సెంటరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కోడిగుడ్లు ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారని ఈ నెల 23న జరిగిన మండల సమావేశంలో చుండి సర్పంచు ఇరపని సతీష్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని ఎంపీపీ మౌనిక, ఎంపీడీవో శేషుబాబు ఆదేశించారు. ఈ మేరకు సూపర్‌వైజర్ చుండిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలను, గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులను విచారించగా వారంతా తమకు సకాలంలో పౌష్టికాహారం అందుతున్నట్లు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే ఇంటూరి పర్యటన

వలేటివారిపాలెం, ఆగస్టు 27 : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం మండలంలో పర్యటించనున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న ల్యాబ్, కంప్యూటర్ గదికి ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, సొసైటీ మాజీ అధ్యక్షుడు వలేటి నరసింహం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెంకు చెందిన పొగాకు బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు పాల్గొంటారని, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.


కదలని సంచార పశు ఆరోగ్యసేవ వాహనం

● పశుపోషకుల ఇక్కట్లు

కోవూరు, ఆగస్టు27 : స్థానిక పశువైద్యశాలలో కొన్నేళ్ల నుంచి సంచార పశు ఆరోగ్యసేవ వాహనం కదలడంలేదని రైతులు, పశుపోషకులు వాపోయారు. మారుమూల పల్లెల్లోని పశువులకు చికిత్స అందించేందుకు గత ప్రభుత్వం నియోజక వర్గానికి ఓ వాహనాన్ని కేటాయించింది. వాహనంలో ప్రతీ నెలా రూ.40వేల విలువచేసే మందుల్ని ఉంచుతున్నారు. గ్రామాల్లో తిరిగి పశువులకు వైద్యసహాయం అందించమని ఆదేశిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ క్రమంలో స్థానిక పశువైద్యశాలకు ఓ వాహనం చేరుకుంది. వచ్చినప్పటి నుంచి ఈ వాహనం పశువైద్యశాల నుంచి కదల్లేదని రైతులు చెబుతున్నారు. వాహనాన్ని నడిపేందుకు డ్రైవరు లేరు. వాహనాన్ని ఉపయోగించి ఎవరు వైద్యం చేయాలో కూడా ప్రభుత్వం వివరించ లేదు. దీంతో ఆ వాహనానికి తమకు ఎలాంటి సంబంధం లేదని పశువైద్యాధికారులు చెబుతున్నారు.ఈ వాహనాన్ని ఉపయోగించేలా చూడాలని రైతులు, పశు పోషకులు కోరుతున్నారు.


కోవూరు పశువైద్యశాలలోని సంచార పశు ఆరోగ్యసేవ వాహనం

వాడకంలోకి తీసుకురావాలి


సంచార పశు ఆరోగ్య సేవ పథకం ద్వారా కోవూరు నియోజక వర్గానికి మంజూరైన వాహనాన్ని వాడకంలోకి తీసుకురావాలి. అది వచ్చినప్పటి నుంచి కదిలిన దాఖలాలు లేవు. పశువుల చికిత్స కోసం సంచార పశు ఆరోగ్యసేవల్ని విస్తరించాలి. డ్రైవరుతోపాటు సిబ్బందిని నియమించాలి.

- ముసలి సుధాకర్, రైతు నాయకుడు, కోవూరు

సిబ్బందిని నియమించాలి


కోవూరు ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో చాలా కాలం నుంచి సంచార పశు ఆరోగ్యసేవ వాహనం నిలచి ఉంది. అది ఏ గ్రామానికి వెళ్లిన దాఖలాలు లేవు. ప్రభుత్వాధికారులు స్పందించి వాహన వినియోగానికి సిబ్బందిని నియమించాలి.

- పొబ్బారెడ్డి మల్లికార్జున రెడ్డి, రైతు నాయకుడు , కోవూరు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు27: కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక గిరి జాహల్ సెంటర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ అధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణభగవానుడి ప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు వేసిన కోలాటం అందరినీ అలరించింది. అలాగే బుచ్చిలోని పలు బాబా మందిరాలు, శ్రీకృష్ణమందిరాల్లో వేడుకలు కొనసాగుతున్నాయి. జొన్నవాడ వరదరాజస్వామి ఆలయంలో స్వామి వారు శ్రీకృష్ణుడి అవతారంలో గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. ఆలయం వద్ద ఉట్టి మహోత్సవం ఆకట్టుకుంది.


గ్రామోత్సవంలో వరదరాజస్వామి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, ఆగస్టు 27 : స్వయం ఉపాధి చేసుకునే మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు సమీపంలో ఉన్న హజారే రెడీ మేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌ను ఆయన సందర్శించారు. క్లస్టర్‌లో స్వయం ఉపాధిగా రెడీమేడ్ గార్మెంట్స్ తయారు చేస్తున్న మహిళలతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పీఎం ఈజీపీ పథకం ద్వారా రుణాలు అందించాలని పరిశ్రమల శాఖల అధికారులకు ఆయన సూచించారు. పెద్ద కంపెనీలతో కొలాబరేట్ అయ్యి పెద్ద మొత్తంలో ఆర్డర్లు పొందాల న్నారు. క్లస్టర్ సోలార్ పవర్ ఏర్పాటు చేసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. తమ ఉత్పత్తులకు బ్రాండింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు చేయడానికి అవసరమైతే ఇంకా కొత్త డిజైన్లలో శిక్షణ కార్యక్రమాలు ఇస్తామన్నారు. తొలుత పారిశ్రామిక వాడలో ఉన్న హనీ పరిశ్రమ, అక్షయపాత్ర కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సిక్ అయినా పరిశ్రమలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా భూములు కావాలంటే సేకరణ చేసి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎండీఐసీ సుధాకర్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ సురేష్, పారిశ్రామికవేత్తలు కొట్టే రామ్మూర్తి, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అక్షయపాత్ర కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్


బదిలీలు వాయిదా వేయండి

నెల్లూరు(హరనాథపురం) : బదిలీలను వాయిదా వేయాలని కోరుతూ ఏపీ కమర్షియల్ ట్యాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు జోన్ నాయకులు, ఉద్యోగులు ఆందోళనకు దిగారు. నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జే నరసింగరావు, కార్యదర్శి జే సుజాతాబాయి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వాణిజ్య పన్నులశాఖలో జరిగిన అక్రమాలు, అవినీతిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఉద్యోగుల బదిలీలను రద్దు చేయాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

మనుబోలు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సిహెచ్. సుబ్బయ్య తెలిపారు. మంగళవారం చెరుకుమూడి రెవెన్యూ పరిధిలోని సర్వేనెం. 23-2లో రెండుచోట్ల ప్రభుత్వ స్థలాలు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఇదే సర్వే నెంబరులో ఉన్న ప్రభుత్వ భూమిని కొమ్మలపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆక్రమించారంటూ గ్రామస్థులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన భూమిని పరిశీలించి హైవే పక్కన కోట్ల రూపాయిలు విలువచేసే భూమిని ఎలా ఆక్రమిస్తారంటూ, దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వారి ఆదేశానుసారం 23-2లో ఎల్‌పిఎం నంబర్ 2175లో 3ఎకరాల 60సెంట్లు, 2170ఎల్‌పీఎం నంబర్‌లో 3ఎకరాల 58సెంట్ల ప్రభుత్వ స్థలంగా గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల్లోకి ఎవరైనా దిగినా, ఆక్రమించి సాగుచేసినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.


ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఓటరు ఐడీ కార్డుల దహనంపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు27: మండలంలోని పెనుబల్లిలో ఓటరు ఐడీ కార్డులు దహనంపై కోవూరు ఈఆర్‌వో ప్రేమ్‌కుమార్, బుచ్చి తహసీల్దారు, ఏఈఆర్వో అంబటి వెంకటేశ్వర్లు మంగళవారం ఆ గ్రామ దళితవాడలోని విచారణ చేపట్టారు. ఈనెల 23న పెనుబల్లిలో జరిగిన గ్రామ సభలో దళితవాడలో ఓటరు ఐడీ కార్డులు తగలబడి ఉన్నాయని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టినట్టు ఏఈఆర్వో, తహసీల్దారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినున్నట్లు వారు తెలిపారు. విచారణలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన వీర అభయాంజనేయ స్వామి ఉత్సవాలు

పొదలకూరు : మారుతినగర్‌లో వీర అభయ ఆంజనేయస్వామి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. హనుమజ్జయంతి అనంతరం జరిగిన ఉత్సవాల్లో 13వ మంగళవారం చివరి ఉభయం గౌడ జన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగింది. రాత్రి 7గంటలకు స్వామివారిని ప్రత్యేక పుష్పఅలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. గౌడ జనసేవా సంఘం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కండలేరు జలాశయం నీటి మట్టం

పొదలకూరు, ఆగస్టు 27 : కండలేరు జలాశయంలో మంగళవారం 6.11 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఏఈ తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 145 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు.

నెల్లూరు రూరల్ డీఎస్పీకి ఎస్పీ పరామర్శ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 27 : ఇటీవల గంజాయి స్మగ్లర్ల దూకుడుతో జరిగిన ప్రమాదంలో గాయపడిన రూరల్ డీఎస్పీ గట్టమనేని శ్రీనివాసరావును ఎస్పీ కృష్ణకాంత్ పరామర్శించారు. మంగళవారం డీఎస్పీ ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. గంజాయి కేసులో ప్రతిభ కనబరిచినందుకు ధైర్య సాహసాలను మెచ్చుకొని ప్రశంసాపత్రం అందించి అభినందించారు. జిల్లా పోలీసు యంత్రాంగం మీ వెంటే ఉందని డీఎస్పీ కుటుంబ సభ్యులకు ఎస్పీ భరోసా కల్పించారు. త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎస్‌ఐని కలసిన జనసేన నాయకులు

సైదాపురం, ఆగస్టు27: ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కాంతి కుమార్‌ను మంగళవారం జనసేన మండల అధ్యక్షుడు చింతలపల్లి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో మండల జనసేన ఉపాధ్య క్షుడు మగ్గం నవీన్‌కుమార్, నాయకులు గుంజి వెంకటేష్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ఇందుకూరుపేట, ఆగస్టు 27: మండలంలోని పల్లెపాడులో గనులు, భూగర్భ శాఖ ఆధ్వర్యంలో సాధారణ ఇసుక మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష

ఇందుకూరుపేట, ఆగస్టు 27 : మండలంలోని కొత్తూరు కేఎస్ఆర్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష జరిగింది. ఈ సమావేశాన్ని జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలోని అన్నీ గ్రామాల నాయకులు కలిసి బీజేపీ సభ్యత్వం నమోదును వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారుబోయిన శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, లేబూరు రాజేందర్‌రెడ్డి, శివప్రసాద్, శివప్రసాద్‌రెడ్డి, మునగచెట్టు కోటయ్య, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థల నిర్వీర్యం : చేజర్ల

కోవూరు, ఆగస్టు 27: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.వైసీపీ నాయకుల అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోయిందన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక వ్యవస్థలన్నీ గాడిలో పెడుతున్నారని వివరించారు. టీడీపీ నాయకులు కలికి సత్యనారాయణరెడ్డి, ఇంటూరు విజయ్, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్‌గా యాకోబు

విడవలూరు, ఆగస్టు 27: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కన్వీనర్‌గా ఊటుకూరు కంచరపాళెనికి చెందిన తోడేటి యాకోబును నియమిస్తూ పీడబ్ల్యూఏ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు బెన్‌హర్‌బాబు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ తన ఎన్నికకు తోడ్పడిన అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలను తెలుపుతున్నానని తెలిపారు. మండలంలో పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బధిర విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు27: స్థానిక ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిర విద్యార్థుల పాఠశాలను ఉపాధ్యాయులు సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, వీవీకే ప్రసాద్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చద్ది

కొడవలూరు ఆగస్టు 27 : మండలంలో నార్సురాజుపాళెంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చద్ది కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు పోలంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు27: మండలంలోని జొన్నవాడ అరుంధతీవాడ సమీపంలోని తిప్ప వద్ద కే శంకర్‌కి చెందిన గడ్డివామి సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. గమనించిన స్థానికులు బాధిత రైతుకు తెలియజేశారు. రైతుతో పాటు చుట్టుపక్కలవారు వెళ్లేటప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. అర్ధరాత్రి కావడంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లింది. గడ్డి వామి కాలిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

జొన్నవాడ పీహెచ్‌సీని తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు27: మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీని అదనపు డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి, వైద్యులు,సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట జిల్లా కో-ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, టీబీ సూపర్‌వైజర్ సురేష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ఎస్‌డీ. అహ్మద్‌బాబు, పీహెచ్ఎన్. ప్రభావతి, సూపర్‌వైజర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.


వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

కృష్ణ.. కృష్ణ హరే!

● ఆలయాల్లో కొనసాగుతున్న కృష్ణాష్టమి ఉత్సవాలు

● మూలాపేటలో మొదలైన అవతారోత్సవాలు



రంగనాథస్వామి ఊంజల్ సేవ, ఉట్టి కొడుతున్న టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 27 : నగరంలోని క్రాంతినగర్ శివకేశవుల దేవస్థానంలో 38వ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. అనంతరం రుక్మిణీ, జాంబవతి సమేత వేణుగోపాల స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉభయదాతలుగా బట్టేపాటి హరి ప్రసాద్‌రెడ్డి-రాజేశ్వరి, రాటకొండ రమణయ్యనాయుడు - రమాదేవి, జీలకం మనోహర్‌బాబు - సుజాత, కోమిశెట్టి మునిరాజా-మునిలక్ష్మీ తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, అనుపల్లి మస్తాన్‌రెడ్డి, గంగపట్నం రవీంద్రరెడ్డి, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వడ్డే శ్రీనివాసులు పర్యవేక్షించారు.

● మాగుంట లే అవుట్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ సహిత అనంత నాగరాజు స్వామికి తిరుమంజనం జరిగింది. అనంతరం శ్రీకృష్ణ స్వామికి సహస్ర నామ పూజ ఘనంగా నిర్వహించారు.

● రాజేంద్రనగర్ (కుక్కలగుంట) మురళీకృష్ణ దేవస్థానంలో శ్రీకృష్ణ జయంతి వసంత బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అఖండ దీపారాధన, మృత్సంగ్రహణం (పుట్టపూజ), అంకురార్పణ, విశేష పూజలు జరిగాయి. పాలక మండలి అధ్యక్షుడు అలిమేలి సుబ్రహ్మణ్యం ఆచారి, ప్రధాన కార్యదర్శి ఆచారి మోహనాచారి, ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.


ఇస్కాన్‌లో శ్రీలప్రభుపాద స్వామి పూజలో భక్తులు

రంగనాథస్వామి ఆలయంలో...

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయంత్రం శ్రీకృష్ణ స్వామికి తిరుమంజనం జరిగింది. శ్రీకృష్ణావతార ఘట్టంపై పురాణ ప్రవచనం చేశారు. ఆ తర్వాత గోపురోత్సవం, ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగాయి. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిలు పర్యవేక్షించారు.

● నగరంలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి పూజల సందర్భంగా మంగళవారం శ్రీల ప్రభుపాద వ్యాసపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో ఉదయం వైభవ భజన సంకీర్తనలు, అభిషేకం, ప్రవచనం జరిగాయి.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో మంగళవారం కృష్ణాష్టమి ఉత్సవాల్లో ఉదయం పవిత్ర హోమాలు జరిగాయి. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. బుధవారం ఉదయం 10గంటలకు రుక్మిణీ కల్యాణం జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని ధర్మకర్తలు కోరారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం

బాలాజీనగర్ పిండిమిల్లు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలాజీ యూత్, చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం శేష వాహన కృష్ణస్వామికి విశేష పూజలు జరిగాయి. వస్త్రదానం చేశారు. రాత్రి ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. నుడా మాజీ చైర్మన్, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, ముంగమూరు చైతన్యరెడ్డి, హనుమంతరావు, అశోక్, రమేష్, దుర్గ, చక్రి, శేఖర్, చరణ్‌రాజు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణావతార మహోత్సవాలు

మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణ అవతార మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. అనంతరం స్వామివారికి శ్రీకృష్ణ అవతారం అలంకారం, ఊంజల్‌సేవ జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ దాసరి చంద్రశేఖర్‌రావు, సిబ్బంది పర్యవేక్షించారు. అవతారోత్సవాల్లో బుధవారం రాత్రి 7గంటలకు ఉట్టి మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చట్ట సవరణ పేరుతో 'వక్ఫ్' నిర్వీర్యం

● అవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 27 : పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ అవాజ్ జిల్లా కమిటీ నగరంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించింది. గాంధీబొమ్మ నుంచి వీఆర్‌సీ మీదుగా కలెక్టరేట్ వరకు ఈ ప్రదర్శన సాగింది. అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికే నూతన చట్టాలు చేస్తున్నట్లు చెబుతోందని, ఇప్పటికే ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేస్తే చాలన్నారు. చట్ట సవరణలు చేసి వక్ఫ్‌బోర్డును నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతస్వేచ్ఛకు ఈ చట్టసవరణ విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు వాటి వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. అవాజ్ జిల్లా అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ జిల్లాలోని వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యజాక్, జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, నాయకులు షేక్ రియాజ్, నజీర్ బాషా, షేక్ చాన్‌బాషా, సయ్యద్ అన్సర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న అవాజ్ కమిటీ

రాష్ట్ర సాఫ్ట్‌బాల్‌లో జిల్లాకు తృతీయ స్థానం

నెల్లూరు (విద్య), ఆగస్టు 27 : గుంటూరు జిల్లా వినుకొండలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 11వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. మంగళవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో రాణించడం అభినందనీయమన్నారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామేశ్వరి, కోచ్ సుకృత పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాదినోత్సవ పోటీలు

జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మంగళవారం 18 నుంచి 40 ఏళ్లలోపు వారికి 100 మీటర్ల పరుగు పోటీ, బ్రిస్క్‌వాక్, చెస్, బ్యాడ్మింటన్, పురుషుల వాలీబాల్, 40 నుంచి 60 ఏళ్లలోపు వారికి 50 మీటర్ల పరుగు, 300 మీటర్ల నడక, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్, 60 ఏళ్ల పైబడిన వారికి 50 మీటర్ల వాకింగ్, యోగా పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కే యతిరాజ్ మాట్లాడుతూ విజేతలకు జాతీయ క్రీడాదినోత్సవమైన గురువారం నాడు బహుమతులు అందచేస్తామన్నారు. బుధవారం పోటీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈవో వెంకటయ్య, కోచ్‌లు పాల్గొన్నారు.

ఆసియా తైక్వాండోలో 'రత్నం' విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు (విద్య), ఆగస్టు 27 : ఆసియా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబ రిచారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ తెలిపారు. నగరంలో నిరిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న పాఠ శాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆ యన మాట్లాడారు. విజయవాడ లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ మైదానంలో ఈనెల 22 నుంచి 24వతేదీ వరకు జరిగిన ఐఎఫ్‌టీయూ చాంపియన్ షిప్‌లో తమ విద్యార్థులు డీ పూర్విత్‌తేజ్, డీ నేత్ర బంగారు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వాసంతి కిషోర్, రోషిణి, ప్రిన్సిపాల్ కల్యాణి, మేనేజర్ రాజేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న జీఎం రామ్మూర్తినాయుడు

ఇస్కాన్ పోటీల్లో విజయం

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ సంస్థ జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యార్థులు విజయం సాధించినట్లు ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నా యుడు తెలిపారు. నగరంలోని పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆ యన మాట్లాడారు. పాటల పోటీల్లో మెడికల్ ఒలంపియాడ్ విద్యార్థిని ఎస్ పూర్ణ ప్రశస్తి ప్రథమ స్థానం, చిత్రలేఖనంలో బీ లక్ష్మీసాయి జైత్రి తృతీయ బహుమతి అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు రూ.10 వేల విరాళం

నెల్లూరు రూరల్, ఆగస్టు 27 : నగరంలోని 26వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు జహీర్‌బాషా అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.10 వేలు విరాళం అందించారు. ఆయన కుమారుడు అర్షద్‌బాషా పుట్టినరోజు సందర్భంగా ఈ విరాళం చెక్కును మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి అందించారు.

నారాయణ గెలుపుతో గోవిందుడికి మొక్కు చెల్లింపు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 27 : గోవిందా.. గోవింద అంటూ తిరుమలకు టీడీపీ నేతలు బయలుదేరి వెళ్లారు. మంగళవారం టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు తిరుపతి నుంచి తిరుమలకు కాలినడకన మార్గంలో చేరుకున్నారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీ పీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ భారీ మొనార్టీతో గెలిస్తే కాలినడకన వస్తానని ధర్మవరం మొ క్కుకున్నారు. 70వేలకుపైగా మెజారిటీ తో నారాయణ విజయం సాధించారు. దీంతో టీడీపీ శ్రేణులంతా బయలుదేరి తిరుమలకు వెళ్లారు. ఈ బృందంలో నారాయణ కుమార్తె పొంగూరు సింధూర కూడా ఉన్నారు.


నడకదారిలో తిరుమలకు వెళుతున్న సింధూర, ధర్మవరం తదితరులు

యూజీడీ పనులు పూర్తి కావాలి

● ప్రణాళికలు సిద్ధం చేయండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 27 : నగరంలో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఎం సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబరులో ఎల్ అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు, ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. నగరంలో ప్రతీ ఇంటి నుంచి డ్రైనేజీ భూగర్భ పారుదల వ్యవస్థ ద్వారా శుద్ధి కేంద్రాలకు చేరాలన్నారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి ముందు నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పరిశీలన జరిపారు. కమాండ్ కంట్రోల్ భవనంలో సీసీ టీవీల ద్వారా నగరంలోని పారిశుధ్య పర్యవేక్షణను పరిశీలించారు. కాగా, నిబంధనలు పాటించకపోవడం, పారిశుధ్యలేమి కారణంగా ఏసీ సెంటర్‌లోని పీకాక్ బార్‌కు రూ.5వేలు జరిమానా విధించారు.


విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 27 : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. వ్యాసరచన పోటీల్లో సర్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సంయుక్త, తేజశ్విని, యశ్విన్ జట్టు ప్రథమ స్థానం, జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కోవూరు వెంకట్, శ్రీకృష్ణ ఫరూక్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే డిబేట్ పోటీల్లో పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సుమసాయిచరిత, శ్రీజ, తేజస్విని ప్రథమ స్థానం, బోగోలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు మహిత, సుహిత, హరిణి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని అధికారులు తెలిపారు. విజేతలకు సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ జీ సుధీర్‌బాబు, నెల్లూరు రూరల్ ఎంఈవో మురళీధర్, హెచ్ఎం కృష్ణారెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందచేశారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 28 ఆగస్టు 2024



ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న ఉద్యోగుల బదిలీల్లో ఎక్కువ మంది తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కానీ, తిరుపతి నుంచి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువయ్యారు. ఈ సమస్యపై బుధవారం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించనున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అందుకే తిరుపతే కావాలంట

- సిఫార్సు లేఖలతో ఉద్యోగుల ప్రయత్నాలు ముమ్మరం
- చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు వచ్చేవారు కరువు
- బదిలీలపై నేడు మూడు జిల్లాల కలెక్టర్ల సమీక్ష

చిత్తూరు జిల్లాలో 43 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో తిరుపతికి 31 మంది, అన్నమయ్యకు 12 మంది వెళ్తామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ విషయానికొస్తే.. డిప్యూటీ తహసీల్దార్లు చిత్తూరు నుంచి తిరుపతికి 8 మంది, అన్నమయ్యకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు చిత్తూరు నుంచి తిరుపతికి 10 మంది, అన్నమయ్యకు 13 మంది వెళ్తామంటున్నారు. సీనియర్ అసిస్టెంట్లు చిత్తూరు నుంచి తిరుపతికి ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు ముగ్గురు, అన్నమయ్య నుంచి తిరుపతి ఒకరు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రస్తుత చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలో పనిచేసే వారిలో ఎక్కువ మంది ఇప్పటికీ తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. రోజువారీగా విధులకు వచ్చి వెళుతున్నారు. వీరంతా తిరుపతి జిల్లాకు దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా బదిలీ అవసరమున్న ఉద్యోగులు తమకు పరిచయమున్న కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు సంపాదిస్తున్నారు. అటెండర్ల నుంచి అధికారుల వరకు.. తాము చేసుకున్న దరఖాస్తుకు ఆయా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల్ని కచ్చితంగా జత చేస్తున్నారు. బదిలీకి అవకాశం లేని వారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో అధికారులకు అర్థం కావడం లేదు.

మ్యూచ్యువల్ ఉంటేనే అనుమతి

తన జిల్లా నుంచి ఒక ఉద్యోగిని కలెక్టర్ రిలీవ్ చేయాలంటే కచ్చితంగా అదే హోదా కలిగిన వ్యక్తి బయటి నుంచి రావాల్సి ఉంది. అందరూ చిత్తూరు నుంచి వెళ్లిపోతామనే దరఖాస్తులు చేసుకుంటున్నారే తప్ప, జిల్లాకు వస్తామనే దరఖాస్తులు లేవు. అధికారులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో మ్యూచ్యువల్ ఉంటేనే బదిలీలను పరిగణనలోకి తీసుకోనున్నారు. అంటే చిత్తూరు నుంచి తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లాలని దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల స్థానంలో అక్కడి నుంచి అదే హోదా కలిగిన ఉద్యోగి చిత్తూరుకు వస్తేనే బదిలీ చేస్తారు. లేకుంటే పరిగణనలోకి తీసుకునే అవకాశాలు తక్కువ. తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి రావాలన్నా ఇదే సూత్రంగా అమలు చేస్తున్నారు.

ఎవరైనా 'అన్నమయ్య'కు వస్తారా?

అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ భర్త చిత్తూరు పక్కన తమిళనాడు రాష్ట్రంలో బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్తూరు చుట్టుపక్కల బదిలీ కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆమెను చిత్తూరుకు పంపేందుకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ సిద్ధంగా లేరు. చిత్తూరు నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అదే హోదా కలిగిన ఉద్యోగి కావాలి. చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా 'అలా చిత్తూరు నుంచి అన్నమయ్యకు వెళ్లేవారు ఉంటే చూసుకుని రండి' అంటూ వారికి సలహా ఇచ్చారు. దీంతో వారు అన్నమయ్య జిల్లాకు మ్యూచ్యువల్‌గా వచ్చే వారున్నారా అంటూ వెతికే పనిలో పడ్డారు.

ఇలాంటి ప్రత్యేక కేసుల్ని పరిగణలోకి తీసుకోవాలి


చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేసే ఓ మహిళా వీఆర్వోకు తిరుపతికి బదిలీ అవ్వాల్సిన అవసరం ఉంది. ఆమె ఒంటరి మహిళ కావడంతో పాటు తన నాలుగేళ్ల కుమార్తె క్యాన్సర్‌తో బాధ పడుతోంది. తిరుపతిలోని తల్లిదండ్రుల వద్ద కుమార్తెను ఉంచి నిత్యం చిత్తూరుకు వచ్చి వెళ్లడం కష్టంగా మారింది. అదే తిరుపతిలో అయితే కుమార్తె బాగోగులు దగ్గరుండి చూసుకుంటూ ఉద్యోగం చేసుకోవచ్చు. ఆమె తిరుపతికి వెళ్లాలంటే అక్కడి నుంచి చిత్తూరుకు మరో వీఆర్వో రావాలనే నిబంధన ఉంది. తాజా బదిలీ తీరు చూసుకుంటే తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. అందరూ తిరుపతే కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఇలాంటి వారికి మానవతా దృక్పథంతో అధికారులు న్యాయం చేయాల్సి ఉంది.

రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలపై ఉత్కంఠ

చిత్తూరు కలెక్టరేట్: స్టాంపులు- రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగుల బదిలీ మార్గదర్శకాలపై సబ్‌రిజిస్ట్రార్లలో ఉత్కంఠ నెలకొంది. ఆదాయార్జన శాఖ కావడంతో రెండేళ్లా? లేదా ఐదేళ్ల సర్వీసును ప్రాతిపదికగా తీసుకుంటారా? జీరో సర్వీసు అంటారా? అన్న దానిపై చర్చలు జరుగుతున్నాయి. బదిలీలకు అనుమతిచ్చి వారం రోజులవుతున్నా ఇంతవరకు మార్గదర్శకాలు అందలేదు. వైసీపీ హయాంలో ఈ శాఖలో బదిలీలు చాలావరకు ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన సబ్‌రిజిస్ట్రార్లను నియమించుకుని అడ్డగోలుగా భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలొచ్చాయి. నగరి నియోజకవర్గంలోని సబ్‌రిజిస్ట్రార్లు అక్కడి ప్రజాప్రతినిధికి నెల మామూళ్లు ఇచ్చేవారని విమర్శలున్నాయి. అలాగే చిత్తూరు ఓ సబ్‌రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి సస్పెండ్ కావడంతో పాటు జైలుకు కూడా వెళ్లారు. ప్రస్తుతం అలాంటివాటికి తావు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారిని ఫోకల్ స్టేషన్లలో నియమించాలని ఉద్యోగవర్గాలు కోరుతున్నాయి. కాగా, రెండేళ్ల కిందట చాలామంది సబ్‌రిజిస్ట్రార్లు బదిలీల నుంచి తప్పించుకోవడానికి పలు ఉద్యోగ సంఘాల్లో సభ్యత్వాలు తీసుకున్నారు. వీరికి స్థాన చలనం నుంచి మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే చాలామందికి అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. పదవుల్ని చూసి అలాంటి వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వద్దని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు కోరుతున్నారు.

ఊరందూరు టీచరుకు జాతీయ అవార్డు

తన కష్టానికి గుర్తింపు లభించిందన్న సురేష్



పాఠాలు బోధిస్తున్న కూనాటి సురేష్

శ్రీకాళహస్తి, ఆగస్టు 27 : అవార్డులకోసం తాను పని చేయలేదని, అయితే జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని తెలిసినపుడు తన శ్రమకు తగ్గ గుర్తింపు లభించినట్లు భావించానని సోషల్ టీచర్ కూనాటి సురేష్ చెప్పారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన సురేష్ తన సొంత మండలంలోని ఊరందూరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూనే విద్యారంగానికి ఎన్నో విశేష సేవలను అందించారు. ఆయన విశేష సేవలను రాష్ట్రప్రభుత్వం గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రకటించింది.సెప్టెంబరు 5న ఢిల్లీలో జరిగే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సురేష్ పురస్కారం అందుకోనున్నారు. రాష్ట్రం నుంచీ ఇద్దరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు.పాఠ్యపుస్తకాలను రూపొందించడం, మారుతున్న సాంకేతిక విధానాలకు అనుగుణంగా డిజిటల్ కంటెంట్ క్రియేట్ చేయడం, ఉచిత పాఠ్యాంశాలను బోధించే మొబైల్‌యాప్ ఉచితంగా అందించడం వంటి ఎన్నో సేవలను ఆయన విద్యార్థులకు చేరువ చేశారు. విద్యార్థులకు అవసరమైన వర్క్ బుక్కులతో పాటు పిక్టోరియల్ సోషల్ స్టడీస్ అనే పుస్తకం ద్వారా దాదాపు వెయ్యి చిత్రాలను, మ్యాపులతో కూర్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తయారు చేసి ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు విజయోస్తు, విజయ సాధన సంకల్పం, మహా సంకల్పం, విజయ స్ఫూర్తి పేర్లతో మెటీరియల్ తయారు చేసి సాంఘిక శాస్త్ర ఫలితాల్లో అగ్రభాగాన ఉండేందుకు కృషి చేశారు.విద్యాపరమైన శిక్షణా తరగతుల్లో రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.డ్రాపౌట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులను తరచూ కలిసి వారిని మళ్లీ పాఠశాలకు పంపించేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.డిజిటల్ మ్యాపులు తయారు చేసి ఉపాధ్యాయులందరికీ ఉచితంగా పంచిపెట్టారు.ఈయన ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తరపున జాతీయ ఉత్తమ ఐసీటీ ఉపాధ్యాయ అవార్డు, ఆంధ్రరత్నం అవార్డు, గ్లోబల్ బెస్ట్ టీచర్ అవార్డు, బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కార్ , గురుమిత్ర అవార్డు, జిల్లాస్థాయిలో రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రావీణ్య ఫౌండేషన్ ప్రత్యేక గుర్తింపు అవార్డు అందుకొని వుండడం విశేషం.

సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 27: జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ షిమోషీ ఆదేశాలు జారీ చేశారు.తిరుపతిలో వీఆర్‌లో వున్న సుబ్బరాయుడిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జయచంద్రను ఏర్పేడుకు పంపించారు. ఏర్పేడు సీఐ శ్రీరామ్ శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపించారు. తిరుపతిలోని అలిపిరిలో పనిచేస్తూ ఇటీవల వీఆర్‌కు వెళ్లిన రామారావును మడకశిరకు బదిలీ చేశారు.రెండు మూడు రోజుల్లో మరో 10మంది సీఐలు బదిలీ కానున్నారు. తిరుపతి ఈస్ట్‌కు మధుబాబు, తిరుమల టూటౌన్‌కు మురళీమోహన్ నియమితులు కానున్నట్లు సమాచారం.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం



స్విమ్స్‌లో విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 27: స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 26 సీట్లకుగాను మంగళవారం తొలుతగా ఆరుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను డైరెక్టర్ ఆర్వీకుమార్ అందజేశారు. వీరంతా నీట్ ఆలిండియా కోటాలో ర్యాంకులు సాధించిన పలు కేటగిరీలకు చెందిన విద్యార్థులు. అడ్మిషన్లు పొందిన వారిలో.. ఏపీ, ఢిల్లీ, జమ్మూకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులున్నారు. ప్రిన్సిపాల్ ఉషా కళావత్, ఏడీ శశికళ, సూపరింటెండెంట్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో..

ఎస్వీ వైద్య కళాశాలలోనూ మంగళవారం ఐదుగురు విద్యార్థులకు ఎంబీబీఎస్ అడ్మిషన్లను ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అందజేశారు. కళాశాలలో 240 సీట్లకుగాను తొలిరోజున హర్యానా, మహారాష్ట్ర, కేరళకు చెందిన ఒక్కో విద్యార్థితోపాటు ఢిల్లీకి చెందిన ఇద్దరు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం



తిరుపతి గోశాలలో ఆవుకు గ్రాసం పెడుతున్న ఈవో శ్యామలరావు దంపతులు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం గోకులాష్టమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. వేంకటేశ్వరస్వామిని ద్వాపర యుగపురుషుడైన శ్రీకృష్ణుడిగా భావించి ఆస్థానం నిర్వహించారు. రాత్రి 8గంటలకు ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహించారు.అనంతరం ద్వాదశారాధనం చేపట్టారు. శ్రీకృష్ణస్వామిని బంగారు తిరుచ్చిపై బంగారు సర్వభూపాల వాహనంపై వేంచేపు చేసి ప్రబంధగోష్ఠి, పురాణ పఠనం చేపట్టారు. కాగా, బుధవారం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటలకు జరిగే ఈ ఉత్సవాన్ని చూడటానికి మలయప్పస్వామి, కృష్ణస్వామి తిరుచ్చిలపై కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తారు. స్థానిక యువత ఉట్లను కొడుతూ స్వామివార్లకు ఆనందాన్ని చేకూరుస్తారు. తిరుపతిలోని టీటీడీ గోశాలలో మంగళవారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపూజలో పాల్గొన్న ఈవో శ్యామలరావు సకల దేవతా స్వరూపమైన గోవును రక్షించడం ద్వారా సనాతన ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పార్థసారథి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లాకర్ల పేరుతో మోసం

భక్తుల వద్ద వసూళ్లకు పాల్పడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): 'మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది.సకాలంలో ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడింది.అది కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ శ్రీవారి భక్తులను బెదిరించి అందినకాడికి దోచుకున్న కర్ణాటకలోని ముల్బాగల్‌కు చెందిన తిలక్ శ్రీనివాస్‌ను తిరుమల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.శ్రీవారిసేవలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు తిరుపతిలోని విష్ణునివాసంలో లాకర్లు తీసుకుని బస చేస్తుంటారు. అయితే తిలక్ శ్రీనివాస్ కొద్దినెలలుగా లాకర్లు పొంది తిరిగి వెళ్లిపోయిన భక్తులకు ఫోన్ చేసి తాను టీటీడీ నుంచి ఫోన్ చేస్తున్నానని, ఆ భక్తుల ఆధార్ నెంబరు, పేరు, లాకర్ పొందిన తేదీ వంటి వివరాలు తెలియజేసి.. మీరు తీసుకున్న లాకర్ ఖాళీ చేయకపోవడంతో ఫైన్ పడిందని, వెంటనే కట్టాలంటూ భయపెట్టేవాడు.వివరాలన్నీ కరెక్ట్‌గానే ఉండడంతో భక్తులు కూడా నమ్మి తిలక్ శ్రీనివాస్ అడిగినంత పంపేవారు. అయితే తాను దర్శనాలు కూడా చేయిస్తానని నమ్మించి తిలక్ శ్రీనివాస్ మోసం చేసేవాడు. ఇటీవల ఓ మహిళ వద్ద ఫైన్ వసూలు చేసిన తిలక్ శ్రీనివాస్ దర్శనం కూడా చేయిస్తానని చెప్పి చేతులెత్తేయడంతో ఆమె విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసింది. విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుపెట్టగా అసలు అక్రమం బయటపడింది. కేసును తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా తిలక్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. అయితే భక్తుల వ్యక్తిగత వివరాలు అతడి వద్దకు ఎలా వెళ్లాయనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. కౌంటర్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి సహకారంతో భక్తుల వివరాలను తిలక్ పొందినట్టు సమాచారం. భక్తుల వ్యక్తిగత వివరాలు ఇలా బయటికి వెళ్లడంతో టీటీడీ ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ఇకపై ఇలా భక్తుల వ్యక్తిగత వివరాలు బయటకు వెళ్లే అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన తిలక్ తన తెలివితేటలను ఇలా భక్తులను మోసగించడానికి ఉపయోగించినట్టు గుర్తించిన పోలీసులు ఇప్పటివరకు ఎంతమందిని మోసం చేశాడు, ఎవరెవరు అతనికి సహకరించారు తదితర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో ఘనంగా ప్రభుపాదుల ఆవిర్భావ వేడుకలు



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 27: తిరుపతిలోని ఇస్కాన్ శ్రీకృష్ణ ఆలయ వ్యవస్థాపకుడైన భక్తివేదాంత ప్రభుపాదుల 128వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనం గా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం 11గంటలకు ప్రభుపాదులకు మహాశంఖాభిషేకం జరిగింది. అనంతరం ప్రభుపాదుల లీలామృతంపై రేవతీరమణ దాసు ప్రవచనం చేశారు.తిరుపతిలో ఇస్కాన్ నిర్మాణానికి 1974లో ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో ఈ ఏడాదికి 50 సంవత్సరాలు పూర్తికావడంతో సాయంత్రం ఆరు గంటలకు టీటీడీ మైదానంలో అభయ్ పేరుతో యువజన కార్యక్రమం నిర్వహించారు. దీంతో మూడు రోజుల జన్మాష్టమి వేడుకలు ముగిశాయి.

ప్రజామోదంతోనే పరిశ్రమల ఏర్పాటు

పెళ్లకూరు, ఆగస్టు 27: ప్రజల ఆమోదంతోనే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని జేసీ శుభమ్ భన్సాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాలచ్చూరు పారిశ్రామిక పార్కులో బిర్లా కార్బన్ పరిశ్రమ ఏర్పాటు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... ప్రజల సమస్యలు, అనుమానాలను తీర్చిన తరువాతే పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు సాగుతామన్నారు. అదేవిధంగా 30 రోజుల వ్యవధిలో ఇక్కడ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమపై అనుమానాలు వ్యక్తం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమలను నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేక పోయిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. సీఎం చంద్రబాబు, ఐటీ, పరిశ్రమలు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమల ఏర్పాటుకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో మేనకూరు సెజ్‌తో పాటు, శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీంతో వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ఏర్పాటు కానున్న పరిశ్రమలో స్థానికులకు హెల్పర్లుగా, స్వీపర్లుగా కాకుండా ఇక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసి పరిశ్రమలకు అవసరమైన విధంగా శిక్షణ ఇచ్చి కీలక విభాగాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేంద్రరెడ్డి, దువ్వూరు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన బిర్లా గ్రూపు ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. పాలచ్చూరు పంచాయతీని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, స్థానిక యువతకే 75 శాతం ఉద్యోకావశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్, వందేళ్లకు పైగా ఉన్న రహదారిని కొనసాగించాలని కోరారు. పర్యావరణ ఇంజినీర్ అశోక్‌కుమార్, తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

గ్రామాలను దత్తత తీసుకోండి

స్థానికులకు ఉద్యోగాలు కల్పించండి

ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ


ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న జేసీ శుభమ్ భన్సల్

నాయుడుపేట టౌన్, ఆగస్టు 27 : పరిశ్రమలు ఆయా పంచాయతీల్లో గ్రామాలను దత్తత తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభమ్ భన్సల్ అన్నారు. మేనకూరు సెజ్‌లోని గ్రీన్‌టెక్ పరిశ్రమలో రెండో ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. 2వ ప్లాంట్ ప్రారంభమైతే మరో 3వేల మందికి ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని జేసీ సూచించారు. అలాగే పరిశ్రమల ప్రాంగణంలో మొక్కలను నాటి వాటి పరిరక్షణ బాధ్యతను పరిశ్రమలే తీసుకోవాలన్నారు.

టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

గ్రీన్‌టెక్ పరిశ్రమలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో జేసీ సమక్షంలో టీడీపీ, వైసీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. ముందుగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మైక్ తీసుకొని ఈ పరిశ్రమ ఉన్న ద్వారకాపురం గ్రామాన్ని అభివృద్ధి చేయలేదని అంతేకాకుండా ఈ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అదే సమయంలో జడ్పీటీసీ సభ్యురాలు కె. జ్యోతి ఈ పరిశ్రమ వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని, ఉద్యోగాలు కల్పిస్తున్నారని అనడం వాగ్వాదానికి కారణమైంది. కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపచేసి సమావేశాన్ని సజావుగా సాగేవిధంగా చర్యలు చేపట్టారు.


సభలో టీడీపీ, వైసీపీ నేతల వాగ్వాదం

గాడి తప్పిన గ్రామీణ వ్యవస్థను పటిష్ఠం చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 27: రాష్ట్రంలో గాడితప్పిన గ్రామీణ వ్యవస్థను పటిష్ఠపరిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులను కేటాయించలేదన్నారు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామాభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేక ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలతో పనిలేకుండా సవష్టిగా కృషిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నేరుగా గ్రామంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అధికారులు కూడా గత వైసీపీ ప్రభుత్వంలో లాగా పనిచేయకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు యామిని, ఎంపీపీ గురవయ్య, పుట్టి వెంకటేశ్వర్లు, దుద్దా రాఘవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లురాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలతోనే బీజేపీ బలోపేతం


దిశానిర్దేశం చేస్తున్న బాలకృష్ణమనాయుడు

గూడూరు, ఆగస్టు 27: పార్టీ బలోపేతం కావాలంటే విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టాల్సి ఉందని బీజేపీ పట్టణాధ్యక్షుడు ఏ. బాలకృష్ణమనాయుడు అన్నారు. మంగళవారం నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి 20వేల సభ్యత్వాలు నమోదు చేసేలా కృషి చేయాలన్నారు. పి.కోటేశ్వరరావు, దయాకర్, నరసప్ప, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బిందురెడ్డి, సురేష్‌బాబు, పద్మ, రమేష్ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి...

కోట: ప్రతి కార్యకర్తా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ... ఒక్కో బూత్‌కి 200 సభ్యత్వాలను చేయాలని ఇందుకోసం నియోజకవర్గంలోని 5 మండలాల నాయకులకు లక్ష్యాన్ని ఇచ్చారు. ఇందుకు సంబంధించి కోట మండల సభ్యత్వ సంయోగ్య ప్రముఖ్‌లుగా పోసిన వెంకయ్యగౌడ్, విశ్వనాథంవాసు, ఎల్. వెంకటేశ్వర్లును బీజేపీ నాయకులు నియమించారు. పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీషా, పి.కోటారెడ్డి, పి.సురేష్, ఏ.శ్రీనివాసులు, నిఖేష్ పరుశురాంసాయి, వెంకటేశ్వర్లు, ఎ.కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకోవాలి


ఇన్వర్టర్‌ను అందిస్తున్న రామ్మోహన్‌రావు

గూడూరు, ఆగస్టు 27: తల్లిదండ్రులను పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విదేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా వృద్ధాశ్రమాలు పెరగడం బాధకరమన్నారు. పిల్లలను ఎంతో ప్రేమగా పెంచి ప్రయోజకులుగా చేసిన తల్లిదండ్రులు నిరాదరణకు గురిచేయడం బాధాకరమన్నారు. ఎ.గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గూడూరు అర్బన్, ఆగస్టు 27: స్థానిక సునీత సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. రాజేశ్వరమ్మ, మెహబూబీ, సువర్ణలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో కృష్ణాష్టమి వేడుకలు



గూడూరు అర్బన్, ఆగస్టు 27: స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకులంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ... విద్యార్థినులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందించారు.

పాఠశాలకు పబ్లిక్ అడ్రస్ సిస్టం వితరణ

చిల్లకూరు, ఆగస్టు 27: మండలంలోని చింతవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం సుందరరాజ దాతృత్వంతో రూ20వేల విలువైన పబ్లిక్ అడ్రస్ సిస్టంను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, సుగుణమ్మ, మాధవి, పెంచలయ్య, శ్రీనివాసులు, దుర్గాశారద, మేరీస్టెల్లా తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో మొక్కల పంపిణీ


మొక్కల పంపిణీలో చంద్రశేఖర్

గూడూరు, ఆగస్టు 27: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనసేన కార్యాలయంలో మొక్కలను అందుబాటులో ఉంచామని పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మొక్కలను నాటేందుకు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 2న క్లీన్ ఆంధ్ర - గ్రీన్ ఆంధ్ర నినాదంతో నియోజకవర్గంలో భారీస్థాయిలో మొక్కలు నాటుతామన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్, మనోజ్‌కుమార్, మహేష్, కార్తీక్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలిలో మోస్తరు వర్షం

ఓజిలి, ఆగస్టు 27 : వేసవిని తలపించిన వేడిమినుంచి మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. 10 రోజులుగా పెరిగిన ఎండలు, మబ్బులు పట్టినా కురవని వానలతో రోజురోజుకు వేడిమి కారణంగా సెగలు పెరిగిపోయాయి. దీంతో పల్లెవాసులు ఎండలకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంగళవారం సాయంత్రం ఉన్నట్టుండి కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. వేసవి తాపం చల్లారిపోయింది. మండలంలోని కురుగొండ, మానమాల, వెంకటరెడ్డిపాళెం, పెద్దపరియ, రాచపాళెంతోపాటు పలు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.

నిబంధనల మేరకే బదిలీలు చేయండి: కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే ఉద్యోగుల బదిలీలు చేయాలని ఉన్నతాధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ అంశంపై మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, గ్రామ, వార్డు సచివాలయాలు, గనులు, భూగర్భ, ఇంజనీరింగ్, దేవదాయ, రవాణా, విద్యుత్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నట్టు వివరించారు. నిబంధనల మేరకు ఐదేళ్లు పూర్తయినవారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని చెప్పారు. అవకతవకలు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో కలిసి బదిలీలపై తగిన నిర్ణయాలు చేయనున్నట్టు వెల్లడించారు. డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి చెన్నయ్య, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.


బదిలీలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే



నాయుడుపేట, ఆగస్టు 27: పట్టణంలోని రాజగోపాలపురంలో ఉన్న రామాలయంలో కృష్ణాష్టమి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా అన్నదానం చేశారు.

మన్నారుపోలూరు రోడ్డు గుంతలమయం



పెట్రోల్ బంక్ వద్ద ఏర్పడిన గుంత- వత్రపాలెం సమీపంలో నడిరోడ్డులో గుంత

సూళ్లూరుపేట, ఆగస్టు 27: సూళ్లూరుపేట నుంచి మన్నారుపోలూరుకు వెళ్లే రోడ్డు అక్కడక్కడా గుంతలతో వాహన చోదలకు అవస్థలు తప్పడం లేదు. వత్రపాలెం నుంచి మన్నారుపోలూరు కోనేరు వరకు నడిరోడ్డులో పలుచోట్ల గుంతలున్నాయి. గత ఏడాడి డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కాళంగి యేరు ఉధృతంగా ప్రవహించింది. ఆ నీరు రోడ్డుపై ప్రవహించడంతో చిన్నపాటి గుంతలు ఏర్పడ్డాయి. అనంతరం కురిసిన చిన్నపాటి వర్షాలకు వాహనాల రాకపోకలకు కంకర లేచి పెద్ద గుంతలయ్యాయి. ఈ గుంతల్లో ద్విచక్ర వాహనదారులు పడిపోయిన సంఘటనలున్నాయి. సూళ్లూరుపేట నుంచి జిల్లా కేంద్రానికి మన్నారుపోలూరు మీదుగా వెళ్లాలి. ఈ రోడ్డులో గుంతలు ఉండడంతో రాత్రి సమయాల్లో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాల్సిన అవసరం ఉంది.

నిబంధనలకు అనుగుణంగా భద్రత

తడ, ఆగస్టు 27 : పరిశ్రమల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు భద్రతా చర్యలు ఉండాలని ఈ మేరకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ నరసింహరావు తెలిపారు. మంగళవారం మాంబట్టు సెజ్‌లో పలు పరిశ్రమల్లో భద్రతా చర్యలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వాటి రికార్డులను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలనునిత్యం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని సంస్థలు, పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

గూడూరు, ఆగస్టు 27: స్థానిక నమాజ్‌కట్ట ప్రాంత సమీపంలో ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 1వ పట్టణ ఎస్‌ఐ శ్రీహరిబాబు తెలిపిన వివరాల మేరకు నమాజ్‌కట్ట సమీపంలో నివాసం ఉంటున్న శ్రీకాంత్(33) ఎలక్ట్రీషియన్. కుటంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకున్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుటుంబీకులు శ్రీకాంత్ ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా శ్రీకాంత్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.

ఉపాధి అవకతవకలపై డ్వామా పీడీ ఆగ్రహం

● రూ.2.36 లక్షల రికవరీ


ఉపాధి హామీ పథక సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ

డక్కిలి, ఆగస్టు 27: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై డ్వామా పీడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథక బహిరంగ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని 27 పంచాయతీల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బృందం నివేదికను చదివి వినిపించింది. ఈ సందర్భంగా పలు పంచాయతీల్లో మస్టర్లు లేకుండానే నిధులు డ్రా చేయడం, కొలతల్లో తేడాలను గమనించిన ఆయన ఉపాధి సిబ్బందిపై మండిపడ్డారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీలకు సంబంధించి అన్ని వివరాలను బహిరంగంగా వెల్లడించామన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలో వివిధ పనులకు సంబంధించి రూ.11.04కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. ఇందులో పలు పంచాయతీల్లో వివిధ రకాల పనులకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యహరించిన సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం తోపాటు రూ. 2.36 లక్షల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఇద్దరిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కూలీలకు మరింతగా చేరువ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.రాజశేఖర్, ఎంపీడీవో ప్రసన్న కుమారి, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గూడూరు, ఆగస్టు 27: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేరుకున్నట్టు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని విందూరు గ్రామ సమీపంలో కైవల్యా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను, పంబలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పురిటిపాళెం సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

లాడ్జీల్లో నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 27: పట్టణంలో లాడ్జీ నిర్వాహకులు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో లాడ్జీ యజమానులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జీలకు వచ్చే వారి వివరాలు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా బయట వ్యక్తులు మహిళలతో లాడ్జీలకు వచ్చినప్పుడు పూర్తి వివరాలు తెలుసుకొని గదులు ఇవ్వాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంతో పరిశ్రమల్లో పనిచేసే వారు ఎక్కువగా ఉండడమే కాకుండా సరిహద్దు ప్రాంతం కావడంతో తప్పని సరిగా లాడ్జీల్లో సీసీ కెమెరాలు ఉండాలన్నారు. ఇక రాత్రి 10 గంటల తరువాత కొత్త వ్యక్తులు వస్తే చిరునామాతో కూడిన గుర్తింపు కార్డులు సరి చూసిన తరువాతే గది ఇవ్వాలన్నారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

విద్యార్థులకు కలెక్టర్ పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 27: ఆర్థికపరమైన అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఆర్బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆర్బీఐ ఎల్డీఎం విశ్వనాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జాతీయ, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో రూ.10లక్షలు, రూ.8 లక్షలు, రూ.6 లక్షలను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని చెప్పారు. దేశంలోని ఐదు జోన్ల పరిధిలోనూ బహుమతులు ఉంటాయన్నారు. జోనల్ స్థాయిలో రూ.5లక్షలు, రూ.4లక్షలు, రూ.3లక్షలను, అలాగే రాష్ట్రస్థాయిలోనూ రూ.2లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్షను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇస్తారని వెల్లడించారు. 1999 సెప్టెంబరు ఒకటో తేదీ ఆపైన జన్మించినవారు, 2024 సెప్టెంబరు ఒకటినాటికి 25 ఏళ్లలోపు విద్యార్థులు ఈ క్విజ్ పోటీలకు అర్హులని వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

- www.rbi90quiz.in/students/register లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- www.rbi90quiz.in/faqs,www.rbi90quiz.in/practice-quiz వెబ్‌సైట్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

నేడు డక్కిలిలో ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, ఆగస్టు 27 : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం డక్కిలిలో పర్యటించ నున్నారు. దేవునివెల్లంపల్లి రోడ్లు సెంటరులో ప్రముఖ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి సంబంధించి ఆర్చి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేస్తారు. అనంతరం డక్కిలి టీడీపీ నాయకులు డి.రత్నాకర రెడ్డి(దేవుడు) కుమారుడి వివాహానికి హాజరు అవుతారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

గ్రామాల్లో ఈ-క్రాప్

కోట, ఆగస్టు 27: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సహాయ వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ఈ-క్రాప్ నమోదు జరి గింది. ఏడగారుసాగుకు సంబంధించి కొత్తపట్నం, ఉత్తమ నెల్లూరు, కర్లపూడి, వంజివాక, తిమ్మానాయుడుపాళెం, వెంకన్నపాళెం, ఊనుగుంటపాళెం, రుద్రవరం, గూడలి, తిన్నెలపూడిల్లో వరి సాగు చేస్తున్నారు. ఆయా పంటలపై మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆదేశాల మేరకు సహాయ వ్యవసాయ అధికారులు రైతుల సహకారంతో ఈ-క్రాప్ సర్వేలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధానంగా 1010, సన్నాలు, బీపీటీ 5204 రకాల వరి సాగు చేస్తున్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు



పెళ్లకూరు, ఆగస్టు 27: డీఎస్పీ చెంచుబాబును టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నాయుడు పేట పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన్ను కలసి పూల మాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నేలవల్లి సిద్దులయ్యనాయుడు కూడా పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

వెంకటగిరి టౌన్, ఆగస్టు 27: పట్టణంలోని కాంపాళెం వద్ద నవజీవన్ ఆర్గనైజేషన్ - సీసీ - టీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాజెక్టు నిర్వాహకురాలు కవిత మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా కార్యక్రమం' ద్వారా ఎయిడ్స్ నివారణ, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమస్యలను టోల్ ఫ్రీ నెం.1097కు తెలిపితే పూర్తి సమాచారం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం 16మందికి ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిత, శిరీష, కల్పన, నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో గోపాల్‌రెడ్డి వర్ధంతి


గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ తదితరులు

కోట, ఆగస్టు 27: మండలంలోని విద్యా నగర్ ఎన్‌బీకేఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో జేఎస్ టీయూ మాజీ వీసీ, ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మాజీ చైర్మన్ డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి 7వ వర్ధంతి మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న గోపాల్‌రెడ్డి కాంస విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితోపాటు ఆయా విభాగాధిపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1979లో ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల స్థాపించి తొలి ప్రిన్సిపాల్‌గా గోపాల్‌రెడ్డి బాధ్యతలు తీసుకొని ఎన్నో ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలని డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

బాలాయపల్లి, ఆగస్టు 27: మండలంలోని కయ్యూరు, వెంగమాంబ పురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూలీలు గిట్టుబాటయ్యేలా పని చేయాలన్నారు. పనుల వద్దే మస్టర్లు తప్పని సరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏపీవో మృత్యుంజయరావు, ఈసీ కరుణాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు

తిరుమల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.26 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 76,910 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,320 మంది తలనీలాలు సమర్పించారు.